
వార్త
ఆదివారం
6 ఏప్రిల్, 2025
దారి తప్పిన
వసంతం !

# 'స్పిరిట్'లో విజయ్ సేతుపతి



ప్రస్తుతం 'ది రాజా సాబ్', 'ఫౌజి' సినిమాలతో బిజీగా ఉన్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్.. తన తరువాతి చిత్రం 'స్పిరిట్'ను సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో చేయనున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమాలో సంజయ్‌దత్ కీలక పాత్రలో నటించనున్నట్లు ఇటీవల వార్తలొచ్చాయి. తాజాగా మరో బిగ్ యాక్టర్ పేరు తెరపైకి వచ్చింది. 'స్పిరిట్' కోసం విజయ్ సేతుపతిని రంగంలోకి దింపుతున్నాడట సందీప్ రెడ్డి. ఇటీవల విజయ్‌ని కలిసి సందీప్ స్క్రిప్ట్ చెప్పాడని తెలుస్తోంది. స్క్రిప్ట్ నచ్చిన సేతుపతి.. ఈ సినిమా చేయడానికి ఒకే చెప్పినట్లు సమాచారం. అయితే ఇందులో విజయ్ సేతుపతి విలన్‌గానో లేదంటే ప్రత్యేక పాత్రలోనో కాదనీ ఒక పవర్ ఫుల్ రోల్‌లో కనిపిస్తాడని టాక్. స్పిరిట్ సినిమా స్క్రిప్ట్ అదిరిపోయేలా వచ్చిందట. ప్రభాస్ రోల్‌తో పాటు పలు రోల్స్ గుర్తుండిపోయేలా ఉంటాయట. అందుకే ఆర్టిస్ట్‌ల విషయంలో సందీప్ ఎక్కడా రాజీ పడలేదని తెలుస్తోంది.

---

**తారాతీరం**

# 'మేర్లపాక' దర్శకత్వంలో వరుణ్ తేజ్!

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' ఫేమ్ మేర్లపాక గాంధీ దర్శకత్వంలో ఇండో కొరియర్ హారర్ కామెడీ నేపథ్యంలో ఓ చిత్రం రూపొందబోతుంది. యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ నిర్మాణంలో ఎస్.థమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రం గత వారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఫస్ట్ ఫ్రేమ్ సంస్థలో గతంలో 'కంచె' సినిమా చేసి మంచి విజయం అందుకున్నాడు వరుణ్‌తేజ్. వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం రెగ్యులర్ చిత్రీకరణ కూడా జరుగనున్నట్లు తెలుస్తోంది. వరుణ్ తేజ్ పాత్ర ఈ చిత్రంలో సరికొత్తగా ఉండబోతుందని మేకర్స్ తెలిపారు. ఈ హిలేరియస్ అడ్వంచరస్ మూవీకి సంబధించిన మరిన్ని అప్‌డేట్స్‌ని మేకర్స్ త్వరలో తెలియనున్నాయి. వరుణ్‌కి ఇది 15వ చిత్రం.



ఆదివారం వార్త

6 ఏప్రిల్, 2025

## మంచి ముత్యాలు

– ఒక విషయం గురించిన తెలిసినా, తెలియకపోయినా ఫ్రెంచి పౌరుడు ఎప్పుడూ మాట్లాడుతూనే ఉంటాడు. ఆంగ్లేయుడు తనకు తెలియని విషయాన్ని గురించి మౌనం వహించడమే మంచిదని భావిస్తాడు. – శామ్యూల్ జాన్సన్

– నిశ్శబ్దానికి చిన్న మార్పు ప్రసంగం. – జార్జి మెరిడిత్

## కదంబం


'సంఘీ'భావం....5

పోలవరానికి మోక్షం కలిగేనా?

కవర్ స్టోరీ..6

దారి తప్పిన వసంతం !

ఈ వారం కవిత్వం...12

నీతో పడవ ప్రయాణం

ఆ చెట్టే ఓ అడవి....... 18

కథ..20

మానవత్వమా! నీ మతమేంటి?

సాహిత్యం.. 23

తల్లినొకసారి తలచుమాంధ్ర!

వకుళాదేవి దర్శనం... 26

జీవకళ ఉట్టిపడే కొండపల్లి బొమ్మలు..... 28

ఇంకా...

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


## తాజా వార్తలు

## ఒకే దీవి రెండు దేశాల్లో..

ఈ దీవి పేరు ఫెసెంట్ ఐలాండ్. దీన్ని ఫ్రాన్స్, స్పెయిన్ దేశాలు పాలిస్తున్నాయి. దాని కథాకమామిషు తెలుసుకుందాం.

ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య సరిహద్దుగా ఉంటోన్న బిడాసో నదిలో ఉందీ ఫెసెంట్ ఐలాండ్. 200 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పు ఉండే ఈ దీవికి ఘనమైన చరిత్ర ఉంది. దీని కోసం ఈ రెండు దేశాలు కొన్ని శతాబ్దాల క్రితం 30 యేళ్ల పాటు యుద్ధం చేశాయి. ఆ తర్వాత రెండు దేశాలకు చెందిన ప్రతినిధులు 11 యేళ్లలో 24 సార్లు సమావేశమై చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. 1659లో రెండు దేశాల ఉమ్మడి నియంత్రణలో ఈ దీవి ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. అపనపటి నుంచి ఇది ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల మధ్య శాంతికి ప్రతీకగా నిలుస్తోంది. ఒప్పందానికి గుర్తుగా ఏర్పాటు చేసిన శిలాశాసనం ఇప్పటికీ అక్కడ చూడొచ్చు. 1660లో స్పెయిన్ చక్రవర్తి ఫిలిమ్ IV కుమార్తె మరియా థెరిసాను ఫ్రాన్స్ చక్రవర్తి లూయిస్ XIV ఈ దీవిలోనే వివాహం చేసుకున్నాడు. ఈ సందర్భంగానే ఫెసెంట్ ఐలాండ్‌ను ఇరు దేశాలు చెరో ఆరు నెలలు పాలించాలనే నిర్ణయానికి వచ్చాయి. దీంతో ఈ ఐలాండ్ ప్రతి యేటా ఫిబ్రవరి 1 నుంచి జులై 31 వరకు స్పెయిన్ అధీనంలో; ఆగస్టు 1 నుంచి జనవరి 31 వరకు ఫ్రాన్స్ అధీనంలో ఉంటోంది. ఇదేం పర్యాటక ప్రాంతం కాదు. పర్యాటకులకు అనుమతి ఉండదు. కానీ, యేటా దీవిని అప్పగించే కార్యక్రమాలు చూడటానికి, చారిత్రక టూర్స్‌లో భాగంగా వెళ్తే మాత్రం పర్యాటకులను అనుమతిస్తారు.



స్పెయిన్ అధీనంలో ఉన్నప్పుడు ఇరున్ మున్సిపాలిటీ, ఫ్రాన్స్ అధీనంలో ఉన్నప్పుడు హెండయె మున్సిపాలిటీ ఈ దీవిని శుభ్రపరిచి, గార్డెనింగ్ పనులు చేస్తాయి. నావికా దళం పర్యవేక్షిస్తుంటుంది. ప్రతి ఐదు రోజులకోసారి నేవీ అధికారులు దీవిలోకి వచ్చి పరిశీలించి వెళ్తారు.

**మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.**
sunmagvaartha@gmail.com





# కుంచె వాడని చిత్రాలు



అందమైన
ఈ చిత్తరువులు.. కళ్లను
కట్టిపడేస్తున్నాయి కదూ! అయితే
ఇవి కుంచె నుంచి జాలు వారిన
చిత్రాలు కావు. పాక శాస్త్రంలో పట్టున్న
వంటగాళ్ల చేతుల మీదుగా జరిగిన అద్భుత
సృష్టి. పండ్లూ, కూరగాయలూ,
ఆకుకూరలను ఒడుపుగా కత్తిరించి
ఆకట్టుకునే దృశ్యాలెన్నింటినో
ఆవిష్కరించారు.
భలే ఉన్నాయి కదూ!















## 'సంఘీ' భావం



# పోలవరానికి మోక్షం కలిగేనా ?

సుమారు ఎనిమిది దశాబ్దాలుగా పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల వాంఛ అయిన పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రతీసారి ఏదో ఒక అడ్డంకి రావడం, పనులు నిలిచిపోవడం జరుగుతూనే ఉంది. ఇప్పటికే పలుమార్లు పోలవరం నిర్మాణం పూర్తి చేయడానికి గడువులు విధించారు. ప్రతిసారీ ఈ తేదీలను మార్చుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం తాజాగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2027 డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేస్తామని ప్రకటించారు. గతంతో పోలిస్తే ఈసారి కేంద్రప్రభుత్వం నుంచి కూడా పూర్తి స్థాయి సహకారం లభించడంతో ఆంధ్రప్రదేశ్ రైతులు, ప్రజలు పోలవరం నిర్మాణం పూర్తి అవుతుందన్న నమ్మకంతో ఉన్నారు. అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం ఇప్పటి వరకు సుమారు 78.56 శాతం పనులు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అండగా ఉండటంతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పోలవరం నిర్మాణంపై పూర్తి ఆసక్తి చూపిస్తోంది. ఇప్పటిదాకా 78.56 శాతం పూర్తయ్యాయి. ముఖ్యంగా డయాఫ్రం వాల్ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. ఈ వాల్ మొత్తం పొడవు 1396.60 మీటర్లు కాగా.. ఇప్పటికి 158.20 మీటర్లు నిర్మించారు. మూడు రాష్ట్రాల మధ్య ఒప్పందం ప్రకారం పూర్తి నీటి మట్టం 150 అడుగులు ఉండేలా రిజర్వాయర్ నిర్మాణం చేయాలని, స్పిల్‌వే సామర్థ్యం 36 లక్షల క్యూసెక్కులుగా ఉండాలని నిర్ణయించారు. పోలవరం రిజర్వాయర్ కారణంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతుండటంతో ఆయా రాష్ట్రాలకు నష్టపరిహారాన్ని అందించాల్సి ఉంటుంది. ఆంధ్ర రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో ముంపుకు గురవుతున్న మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. భద్రాచలం రెవిన్యూ డివిజన్‌లోని కూనవరం, వరరామచంద్రాపురం, చింతూరు, భద్రాచలం మండలాలు.. పాల్వంచ రెవెన్యూ డివిజన్‌లో వేలేరుపాడు, కుక్కునూరు, బూర్గంపాడు మండలాలు కలిశాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రధానంగా మూడు దశలు ఉన్నాయి రిజర్వాయర్, స్పిల్ వే, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం భాగాలు ఇందులో ఉన్నాయి. రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేస్తారు. రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసేందుకు స్పిల్‌వే ఉపయోగపడుతుంది. రెండు కొండల నడుమ దీనిని నిర్మిస్తున్నారు. మొత్తం 48 గేట్లు ప్రతిపాదించారు. రిజర్వాయర్‌కు రెండు కాలువలు ఉంటాయి. ఒకటి కుడి వైపు.. రెండోది ఎడమ వైపు. వీటి ద్వారా నీటిని తరలిస్తారు. డయాఫ్రం వాల్ నది మధ్యలో దాదాపు 300 అడుగుల లోతులో కడుతున్న కాంక్రీటు గోడ.. ఇది నీరు లీకేజీ కాకుండా కాపాడుతుంది. దీని పొడవు 2.454 కిలోమీటర్లు. రాతి, మట్టి కట్టడం.. డయాఫ్రం వాల్‌కు ఇరువైపులా రాతి, మట్టి కట్టడంను నిర్మిస్తారు. ప్రధాన డ్యామ్‌ను నిర్మించే టప్పుడు నీరు అడ్డు తగలకుండా ఉండేందుకు తాత్కాలికంగా కాఫర్ డ్యాంను నిర్మిస్తున్నారు. రెండు కాఫర్ డ్యామ్‌లు పోలవరం విషయంలో రెండు కాఫర్ డ్యామ్‌లు ప్రతిపాదించారు. నది ప్రవాహం అడ్డు తగలకుండా ఎగువన ఒకటి, ధవళేశ్వరం బ్యారేజీ బ్యాక్ వాటర్ అవరోధం కలిగించకుండా దిగువున ఒక డ్యాం నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలలో సుమారు 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. విశాఖపట్నంలో కర్మాగారాల నీటి అవసరాలను తీర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖపట్నం నగరానికి తాగు నీరు అందించనున్నారు. కృష్ణా బేసిన్‌లో నీటి లభ్యత తగ్గుతున్నందున బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా పోలవరం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. రాష్ట్ర విభజన ఏపీకి కేంద్రం పోలవరం వరంగా ప్రకటించింది. తామే పూర్తి చేసి ఇస్తామని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. తొలి సీఎం అయిన చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం పనులు సాగాయి. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వచ్చిన వెంటనే ప్రాజెక్ట్ నిర్మిస్తున్న కాంట్రాక్ట్ సంస్థను తొలగించింది. దీనితో కొన్ని నెలలు పనులు జరగకుండా నిలిచిపోయాయి. ఇపుడు మళ్ళీ చూస్తే చంద్రబాబు నాయుడు సీఎం కావడంతో ఆయన పోలవరం ప్రాజెక్ట్ మీద పూర్తిస్థాయి దృష్టి సారించారు. మూడు సార్లు పోలవరాన్ని సందర్శించిన ఆయన నిర్వాసితులకు పూర్తిస్థాయి అండదండలు ఉంటాయని చెప్పారు. అంతేకాకుండా పునరావాస నిధులు వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం ఏనాడో పూర్తి కావాల్సి ఉందని, గత పాలకులు పట్టించుకోకపోవడం వల్లనే జాప్యం అయింది అన్నారు. 2019లో టీడీపీ మళ్ళీ అధికారంలోకి వచ్చి ఉంటే కనుక పోలవరం పూర్తి చేసేవారమని కూడా అన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లనే డయాఫ్రం వాల్ కొట్టుకుని పోయిందని అప్పట్లో నాలుగు వందల కోట్లతో నిర్మించామని ఇపుడు మళ్ళీ వేయి కోట్లు ప్రజా ధనం ఖర్చు అవుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం పోలవరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా పూర్తి స్థాయిలో సహకారం లభిస్తోంది. ఈ కారణంగా ఆశించిన గడువులోగానే ప్రాజెక్ట్ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# దారి తప్పిన వసంతం!



**కవర్ స్టోరీ**

**తండ సదానందం**

**ప్రకృతి ధర్మమును అనుసరించి సంవత్సరానికి మూడు కాలాలుగా నిర్ణయించబడ్డాయి. అవి వేసవికాలం, వర్షాకాలం, శీతాకాలాలు. వీటి కాల పరిమాణం నాలుగు నెలలు. భూమిపై సూర్యుని చుట్టూ భూమి కక్ష గ్రహణ యానానికి సంబంధించి భూమి అక్ష సంబంధ ఒంపు ఫలితంగా కాలములు ఏర్పడతాయి. నాలుగు వందల యాభై నాలుగు కోట్ల సంవత్సరాల క్రితం భూమిపై ప్రకృతి ఏర్పడటం మొదలైంది. మొదట్లో కాలగమనం సక్రమంగానే ఉండేది. మానవుడు ప్రకృతితో చెలగాటం ఆడుతూ పర్యావరణాన్ని పాడు చేయడంతో కాలగమన చక్రం గతి తప్పింది.**

ఎండాకాలంలో మండుటెండలు, శీతాకాలంలో చలి పులి, వర్షాకాలంలో వరదల బీభత్సం మానవ మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఉదయం 7-8 గంటలకే ఎండలు దంచేస్తున్నాయి. మధ్యాహ్నం వేళ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో దేశంలోని చాలా ప్రాంతాల్లో, సగటు ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా ఉంటాయని భారత వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఏప్రిల్, జూన్‌ల మధ్య ఎండ వేడిమి తీవ్రంగా ఉంటుందని శాస్త్రజ్ఞులు అంచనా వేస్తున్నారు. గత 124 ఏళ్లలో అత్యంత వేడి నెలగా ఫిబ్రవరి రికార్డులోకి ఎక్కింది. గత నెలలో సగటున 22 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయిందని, 1901 తర్వాత ఫిబ్రవరి నెలలో ఈ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కావడం తొలిసారి అని వాతావరణ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా సగటు ఉష్ణోగ్రతల కన్నా అధికంగా నమోదై ఎండలు తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయి. ఎండల నుండి తట్టుకోవడానికి అకస్మాత్తుగా వర్షాలు పడితేనే ఉపశమనం కలుగుతుంది. ఈసారి విపరీతమైన ఎండలు తప్పవనీ, అలాగే వడగాలులు అధికంగా వీస్తాయని ముఖ్యంగా ఉత్తర తెలంగాణకు వేడిగాలుల ముప్పు, దక్షి ణ తెలంగాణకు ఎండ తీవ్రత సాధారణం కంటే పెరిగే అవకాశం ఉంది. ఏప్రిల్, మే నెలలో గరిష్ట ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్ నుండి 46 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం వేసవి సీజన్ మార్చి ఏప్రిల్ మే నెలల్లో ఎండల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. భూమధ్య రేఖ ప్రాంతంలో వాతావరణం వేగంగా మారుతుందని, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్, ఉత్తరాఖండ్‌లోని ఉత్తర ప్రాంతాల్లో భారీగా మంచు కురుస్తుంది. లానీనా ప్రభావం వలన భారత్‌లో వాతావరణ మార్పులు ఏర్పడుతున్నాయి.

కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలంతా ఒక్కసారిగా ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడటం మొదలవడంతో రాష్ట్ర విద్యుత్ డిమాండ్ రికార్డ్ స్థాయిలో ఫిబ్రవరి 4, 2025న 15 వేల 582 మెగావాట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే రోజు 13,296 మెగావాట్ల వినియోగం నమోదయింది. మే నెలలో ఎండలు ఎలా ఉంటాయో అని ప్రజలు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## వసంతం కనుమరుగు
## ఎండాకాలంలా మారుతున్న శీతాకాలం

ఉత్తర భారతదేశంలో 1970 నుండి శీతాకాలం క్రమంగా ఎండాకాలంగా మారుతూ వస్తున్నదని అమెరికన్ శాస్త్రజ్ఞుల బృందం క్లైమేట్ సెంట్రల్ హెచ్చరించింది. ఈ బృందం 1970 నుంచి డిసెంబరు-ఫిబ్రవరి మధ్య కాలంలో ఉత్తర భారత దేశంలో ఉష్ణోగ్రతల తీరుతెన్నులను విశ్లేషణ చేసింది. ఉత్తరాదిలో జనవరి నెలలో ఉష్ణోగ్రతలు ఎక్కువ, తక్కువలు అవుతున్న ఫిబ్రవరిలో మాత్రం సగటుకు మించి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని మార్చ్‌లో ఉండవలసిన ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి లోనే నమోదవుతున్నాయని క్లైమేట్ సెంట్రల్ విశ్లేషణలో తేలింది. ఉత్తరాది రాష్ట్రాలలో జనవరి, ఫిబ్రవరి నెలలో ఉష్ణోగ్రతల తేడా రెండు డిగ్రీలుగా కనిపిస్తుంది. దీనిని బట్టి పలు ఉత్తరాది రాష్ట్రాలలో వసంతం అదృశ్యమైనట్లేనని భావించవలసి వస్తుంది. 1850 నుండి భూగోళం సగటు ఉష్ణోగ్రత 1.3 డిగ్రీ సెల్సియస్ మేర పెరిగింది. ఇంతవరకు నమోదైన వాతావరణ గణాంకాల ప్రకారం అత్యధిక ఉష్ణ సంవత్సరంగా 2023 రికార్డులకు ఎక్కింది. 2030 వరకు కర్బన ఉద్గారాలను 43 తగ్గించకపోతే భూగోళం నిప్పుల కొలిమిలా మారుతుందని పర్యావరణ వేత్తల ఆందోళన.

ఈ శతాబ్దం ముగిసే నాటికి అనగా 2100 నాటికి సంవత్సరంలో ఆరు నెలలు ఎండాకాలం ఉంటుందని, చలికాలం బాగా తగ్గిపోయి,నెల, నెలన్నర రోజులకే పరిమితం అవుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరో నాలుగు నెలలు వానాకాలం ఉంటుందని అందులో సగం

రోజులు మాత్రమే వర్షాలు పడే అవకాశం ఉంటుందని హెచ్చరికలు చేస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా కాల గమనం మారుతుందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్స్, అమెరికాలోని కెంట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై వారు తమ పరిశోధనలను కొనసాగిస్తున్నారు. మార్చి నుండి జూన్ దాకా నాలుగు నెలలు ఎండాకాలం కొనసాగు



తుంది. ఎంతటి వేసవికాలం అయినా సరే రెండు, మూడు దశాబ్దాల కిందట వరకు 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కావడం చాలా అరుదు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఎండాకాలం సమీపిస్తుందంటే ప్రజలు గడగడలాడుతున్నారు. ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల, 48 డిగ్రీల సెల్సియస్ వరకు కూడా వెళ్తున్నాయి. మరికొన్ని సంవత్సరాలలో 50 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగిపోయే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. 1952 నుండి 2011 వరకు రోజువారి వాతావరణ రికార్డులను పరిశీలించిన కెంట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వాతావరణ మార్పులకు సంబంధించి 1950 దశాబ్దంలో సగటున్న 78 రోజులుగా ఉన్న ఎండాకాలం 95 రోజులకు చేరిందని, అదే చలికాలం 73 రోజులకు, వానాకాలం 82 రోజులకు తగ్గిపోయాయని వెల్లడించారు. భవిష్యత్తులో ఏకంగా ఎండాకాలం ఆరు నెలల పాటు ఉంటుందని అంచనా.

### సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి

కాలిఫోర్నియా, బర్కిలి, హార్వర్డ్ యూనివర్సిటీల శాస్త్రవేత్తలు కూడా 1850 నుండి 2007 వరకు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో ఉన్న వాతావరణ వివరాలను విశ్లేషించి ఋతువుల మార్పు జరుగుతుందని తమ పరిశోధనలో తెలిపారు. చలికాలం సమయం తగ్గి ఎండాకాలం పరిధి పెరుగుతుందన్నారు. కాలాన్ని బట్టి వలస వెళ్లే పక్షులు కొన్నేళ్లుగా ముందుగానే వలస పోతున్నాయని, కొన్ని రకాల చెట్లు ముందుగానే పుష్పిస్తున్నాయని ప్రకటించారు. ముఖ్యంగా చలికాలంలో సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తేల్చారు. హిమాలయాల ప్రాంతంలో ఉండే రోడ్ డెన్డ్రాన్ చెట్లు ఎండాకాలంలోనే మార్చి, ఏప్రిల్‌లో పూలు పూస్తాయి. కానీ కొన్ని సంవత్సరాలుగా జనవరిలోనే పూస్తున్నాయని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**కారణాలు** మానవుడు తన సుఖమయ జీవనానికి, ఆధునిక నాగరికత పద్ధతులు అవలంబిస్తూ, తమ మేధస్సును ఉపయోగించి నూతన ఆవిష్కరణలు చేపట్టి వస్తువులను తయారు చేసుకుని ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తుండడంతో వాతావరణ కాలుష్యానికి కారకుడు అవుతుండడంతో గ్లోబల్ వార్మింగ్ పెరిగి ప్రపంచ వ్యాప్తంగా వీచే రుతుపవనాల మార్గంలో, కాలంలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి పేరిట విధ్వంసకరాభివృద్ధికి పాల్పడుతూ ప్రపంచవ్యాప్తంగా అడవులను నరికి వేయడంతో అటవీ విస్తీర్ణం తగ్గిపోయి మొక్కలు చెట్లు సంగ్రహించాల్సిన సూర్యకిరణాల వేడి వాతావరణంలో నిలిచి ఉష్ణోగ్రతల పెరుగుదలకు కారణమవుతున్నాడు. మరోవైపు పారిశ్రామికీకరణ పెరిగిపోవడంతో వెహికల్స్, ఫ్యాక్టరీల నుంచి విడుదలవుతున్న కార్బన్ ఎమిషన్స్ పెరుగుతుండడంతో గ్లోబల్ వార్మింగ్ గ్లోబ్‌కే ముప్పుగా తయారైంది. అందువలననే ఎండాకాలం మొదట్లోనే ఎండలు సుర్రుమంటున్నాయి. దీంతో వడగాలులు తీవ్రతరమై, రాత్రి వేళల్లో చలికాలంలో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. కార్చిచ్చు లాంటివి పెరిగి పర్యావరణం సమతుల్యత దెబ్బతింటోంది. ఆస్ట్రేలియా, అమెరికా, కెనడాలలో ఈ కార్చిచ్చులు తరచుగా సంభవిస్తూ పర్యావరణాన్ని పాడు చేస్తున్నాయి. అభివృద్ధి పేరుతో ఫ్యాక్టరీలను నెలకొల్పడానికి, హైవే, గ్రీన్ ఫీల్డ్ హైవేల వంటి రోడ్ల నిర్మాణం చేపట్టి, ఓపెన్ కాస్ట్ల పేరిట బొగ్గు తవ్వకం, ఖనిజాల వెలికితీత కోసం అడవులను నరికి వేయడం మూలంగా, అడవులు ధ్వంసమై మానవ మనుగడకు పెను సవాల్‌గా మారే భూతాపం పెరుగుతున్నది. అలాగే పరిశ్రమల నుండి ప్రమాదకర స్థాయిలో కర్బన ఉద్గారాలు విడుదలవుతుండడం, హానికారక రసాయనాలు, వ్యవసాయంలో వాడుతున్న విచ్చలవిడి పురుగు మందుల వల్ల భూమి వేడెక్కి మంచు పర్వతాలు కరుగుతున్నాయి. ఫలితంగా సముద్ర మట్టాలు పెరిగిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తద్వారా అకాల వర్షాలు, వరదలు, కరువు కాటకాలు సంభవిస్తున్నాయి. అడవి నిర్మూలన, వాహనాల అధిక వినియోగం, పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ కార్యకలాపాలు భూతాపానికి మూల కారణాలు. సూర్యుని నుండి వెలువడే అతినీలలోహిత కిరణాలు భూమిని చేరడం వల్ల భూమి ఉష్ణోగ్రత పెరుగుతుంది. అతినీలలోహిత కిరణాల నుండి కాపాడే ఓజోన్ పొర గ్రీన్ హౌస్ వాయువుల కారణంగా క్షీణించిపోతుంది. కార్బన్ డయాక్సైడ్, మిథేన్ నైట్రస్ ఆక్సైడ్ ఫ్లోరినేటెడ్లను గ్రీన్ హౌస్ వాయువులు అంటారు. గత ఎనిమిది లక్షల సంవత్సరాలలో ఎప్పుడు లేనంతగా గ్రీన్ హౌస్ వాయువులు ఇప్పుడు భూ



వాతావరణంలో అధికంగా ఉన్నాయి. పారిశ్రామికీకరణ మొదట్లో ఉష్ణోగ్రతతో పోలిస్తే రెండు డిగ్రీల సెల్సియస్ పెరుగుదల, వాతావరణంలో ప్రమాదకరమైన మార్పులు సంభవించే అవకాశం ఉంది. ఈ విధంగా మానవుడు ప్రకృతికి విరుద్ధంగా పోతుండడంతో రోజు రోజుకి భూమిపై ఉష్ణతాపం అధికమవుతోంది.

ఇది ప్రస్తుత తరానికే కాదు, భవిష్యత్తు తరాల వారికి కూడా ప్రాణ సంకటమే.

### నగరాలు మండుతున్నాయి..

విలాసవంతమైన నివాస గృహాలు, ఫ్యాక్టరీలు నెలకొల్పడానికి పెద్ద ఎత్తున నిర్మాణ పనులు జరుగుతున్నాయి, స్థిరాస్తి వ్యాపారాల కోసం పంట పొలాల వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చడంతో పచ్చని చెట్లు కనుమరుగవుతారు, కాంక్రీట్ రోడ్ల భవనాలు వెలుస్తుండడం, ఏసీల వాడకం పెరిగిపోవడం వల్ల వాటి నుండి వెలువడే వేడిగాలి కలవడంతో బయట వాతావరణం మరింత వేడెక్కిపోతుంది. కాంక్రీట్ నిర్మాణం, తారు రోడ్లు మధ్యాహ్నం వేడిమిని గ్రహించి రాత్రిపూట విడుదల చేయడం వల్ల రాత్రీ, పగలు అన్న తేడా లేకుండా నగరాల్లో వేడి పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మన దేశంలో ప్రతి సంవత్సరం ఢిల్లీ నగరంలో మిగతా అన్ని నగరాల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదై హీటెస్ట్ సిటీగా ఉండేది, కానీ ఢిల్లీ రికార్డును ఇటీవల బెంగళూరు సిటీ కొట్టేసింది.

### భూతాప ప్రభావం

భూమి వేడెక్కడం వలన వందేళ్లకు ఒసారి సముద్రం మట్టం పెరుగుదలకు కారణమయ్యే విపత్తులు ఇక నుండి దశాబ్దానికి ఒక మారు, ఈ శతాబ్దం చివరలో ఆరంభమై ఏటా సంభవిస్తాయని ఇంటర్నేషనల్ పార్లమెంటరీ క్లైమేట్ చేంజ్ ఐపిసిసి పేర్కొంది. భూతాపం పెరిగి హిమాలయ పర్వతాలలోని హిమాని నదులు కరగడంతో సముద్ర మట్టాలు పెరిగి ముంబై, చెన్నై, కొచ్చి, విశాఖపట్టణం లాంటి 12 తీర ప్రాంతాల పట్టణాలకు ముప్పు వాటిల్లనుంది. దక్షిణ భారత దేశంలో ఊహించని భారీ వర్షాలు పడతాయి. అన్ని సముద్రాల కంటే హిందూ మహాసముద్రమే ఎక్కువగా వేడెక్కుతుంది. రాబోయే 10 సంవత్సరాలలో కరువు కాటకాలు వడగాలులు, కార్చిచ్చులు, తుఫాన్లు తీవ్రమవుతాయి ఉన్నఫళంగా కుంభవృష్టి కురుస్తుందని నదులు పొంగుతాయని, అంతలోనే తట్టుకోలేని ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రుతుపవనాల గతి తప్పి అతివృష్టి, అనావృష్టి రెండూ ఏకకాలంలో విరుచుకుపడతాయి. రోజురోజుకు భూమండలంపై కర్బన ఉద్గారాలు పెరిగేకొద్దీ గాలి నాణ్యత తగ్గిపోతున్నది. వాతావరణం తేమను కోల్పోతున్నది. సంపన్న దేశాల విలాసవంతమైన జీవన విధానాల వల్లనే కాలుష్యం, భూతాపం పెరిగి నదులు, సముద్రాలు కాలుష్య భరితమై కొన్ని రకాల జీవులు అంతరించిపోతుండడంతో జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. వాతావరణంలోని ఉన్న గ్రీన్‌హౌస్ వాయువుల్లో 85 శాతం సముద్రాలు గ్రహిస్తాయి. దీంతో అధికంగా అవి వేడెక్కుతున్నాయి. ఈ పరిణామం గత 15 యేళ్లలో బాగా పెరిగింది. 191 నుండి 2018 మధ్య సముద్ర మట్టం 20 సెంటీమీటర్ల మేర పెరిగింది. కార్బన్ డై ఆక్సైడ్ గ్రహించడం వల్ల సముద్రాల్లో ఆమ్లీకరణ అధికమవుతుంది. వేడి వాతావరణం వల్ల కొన్ని రకాల సూక్ష్మజీవులు వైరస్‌ల వ్యాప్తి పెరుగుతుంది. అలాగే కలరా, డయేరియా, మలేరియా, డెంగ్యూ, చికెన్‌గునియా లాంటి వ్యాధుల సంఖ్య పెరుగుతుంది. భూమి వేడెక్కడం వల్ల పంటల దిగుబడి తగ్గిపోతుంది. వ్యవసాయ రంగం సంక్షోభంలో నెట్టబడి రైతుల ఆత్మహత్యలకు అడ్డుకట్ట వేయలేని పరిస్థితి నెలకొంది. ఏటికేడు ఎండల తీవ్రత పెరగడానికి ప్రధాన కారణం గ్లోబల్ వార్మింగ్. దీంతో వడదెబ్బకు గురై మరణాల సంఖ్య పెరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు కారణమవుతున్న ప్రధాన పది సహజ విపత్తుల్లో వడ గాలులు ఒకటి కావడం గమనార్హం. ఎండ వేడిమికి ఎక్కువ ఉష్ణోగ్రత పెరిగి ప్రాణాల మీదికి వస్తుంది. చర్మానికి రక్తప్రసరణ పెరిగి, కిడ్నీలకు రక్త ప్రసరణ



తగ్గుతుంది. చమట మూలంగా ఒంట్లో నీటి శాతం తగ్గటం ఎక్కువసేపు కొనసాగితే కిడ్నీలు దెబ్బతిని మూత్రం ఉత్పత్తి తగ్గటం, వికారం, వాంతి, కళ్ళు తిరగడం, నీరసం, నిస్సత్తువ వంటి లక్షణాలు, కిడ్నీలలో రాళ్ళు ఏర్పడడం జరుగు తుంది. చెమటరూపంలో నీటి శాతం బాగా తగ్గిపోయినప్పుడు డిహైడ్రేషన్ తలెత్తుతుంది. తద్వారా రక్తంలోని ప్లాస్మా తగ్గుతుంది. రక్తపోటు పడిపోతుంది. వడదెబ్బ తగిలినప్పుడు శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వ్యవస్థ దెబ్బతింటుంది. మానవ దేహం సాధారణ ఉష్ణోగ్రత 37 నుండి 38 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటుంది. కనుక ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ ప్రకారం మానవ శరీరానికి చుట్టూ గాలి ఉష్ణోగ్రత 18 డిగ్రీ సెంటీగ్రేడ్ నుండి 24 డిగ్రీల సెల్సియస్ వరకు ఉంటే మంచిది అని తెలుపుతుంది. ఎండాకాలంలో నీటి కొరతతో నీరు కలుషితం అవుతుంది. బోరు బావులు, బావుల వంటి వాటి నుండి చాలా లోతు నుంచి తోడే నీటిలో రసాయనాలు, వాయువులచే కలుషితం కావడం వలన కిడ్నీల మీద విపరీత ప్రభావం చూపెడుతుంది. శారీరిక శ్రమ చేసే వారిలో, ఎండలో పని చేసే వారిలో డిహైడ్రేషన్ ఎక్కువ. వేడిగాలులు గుండె జబ్బులు గల వారికి అయితే మరి కొన్ని సమస్యలు వస్తాయి. శరీరంలో ఉష్ణోగ్రత పెరిగినప్పుడు దీన్ని తగ్గించడానికి చర్మానికి ఎక్కువగా రక్త సరఫరా చేయాల్సి ఉంటుంది. కనుక గుండె మరింతవేగంగా బలంగా రక్తాన్ని పంపు చేస్తుంది. వాతావరణం చల్లగా ఉన్నప్పటికంటే వేడిగా ఉన్నప్పుడు గుండె ప్రతి నిమిషా నికి రెండు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా రక్తాన్ని సరఫరా చేస్తుంది. ఇలా గుండె మీద అదనపు భారం పడేలా చేస్తుంది.



ఎండాకాలం గాలి ప్రభావం వల్ల కళ్ల మంటలు, దురద, నీరు రావడం వంటివి తలెత్తుతాయి. వేడి గాలిలోని దుమ్ము ధూళి ముక్కులోకి ప్రవేశించినప్పుడు ముక్కులో అలర్జీ పుడుతుంది. కొంతమందికి సైనసైటీస్ ప్రాబ్లం కూడా రావచ్చు. వాహనాల నుండి వెలువడే రసాయనాలు, దుమ్ము శ్వాస ద్వారా లోపలికి వెళ్ళినప్పుడు శ్వాస నాళాల గోడలు ఉబ్బిపోయి లోపలి మార్గం కుంచించుకుపోతుంది. ఫలితంగా ఆస్తమాకు దారి తీస్తుంది. ఎండ వేడి వల్ల ఆహార పదార్థాలు త్వరగా పాడై జీర్ణ సమస్యలను కలగజేస్తుంది. వేసవిలో దోమలు పెరిగే అవకాశం ఎక్కువ. ఇవి డెంగ్యూ మలేరియా చికెన్ గునియా వంటి వ్యాధులను కలగజేసే అవకాశం ఉంది. వేసవి కాలంలో దుమ్ము పొగ ఏర్పడే అవకాశం ఎక్కువగా ఉండటం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు రావచ్చు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

* ఎండాకాలంలో డిహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు రోజుకు రెండు మూడు లీటర్ల నీరు తాగడం మంచిది.
* నేరుగా ఎండలోకి ఎక్కువసేపు వెళ్ళకూడదు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటలలోపు బయట తిరగరాదు.
* బాగా పొడవైన, తేలికపాటి తెల్లటి కాటన్ దుస్తులు ధరించాలి.
* పొడి, మసాలా, ఆయిల్ ఫుడ్ తగ్గించి పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినడం మంచిది. పండ్ల రసాలతో డిహైడ్రేషన్ సమస్య తీరదు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.
* స్ట్రీట్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి.
* తరచుగా చేతులను శానిటైజ్ చేయాలి, బయటికి వెళ్ళినప్పుడు విధిగా మాస్కులు ధరించాలి.
* ఇంట్లో వాతావరణం చల్లగా ఉండే విధంగా చూసుకోవాలి.
* ఎండలో ప్రయాణించేవారు టోపీ, గొడుగు, హెల్మెట్, గ్లాసెస్, సన్ స్క్రీన్ లోషన్ తప్పనిసరిగా వాడాలి.
* తీసుకునేటువంటి ఆహార పదార్థాలలో తగినంత ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండే విధంగా చూసుకోవాలి. ఆల్కహాల్, సిగరెట్లు, కార్బోనేటెడ్ వంటి ద్రావణాలకు దూరంగా ఉండాలి.

### చిన్నారులు జాగ్రత్త!

ఎండాకాలం పిల్లలైనా, పెద్దలైనా జాగ్రత్తగా ఉండాలి. పిల్లల్ని మరీ జాగ్రత్తగా చూడాలి. ఎండ వేడిమి వల్ల బయటి వాతావరణం చాలా వేడిగా ఉంటే పిల్లల శరీర ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది. దానిని నియంత్రించే కేంద్రం పిల్లల మెదడులో చాలా బలహీనంగా ఉంటుంది. అందువల్ల వడదెబ్బ తినే అవకాశం పిల్లలలో ఎక్కువగా ఉంటుంది. కనుక ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో పిల్లలను ఇండ్లలోనే ఉంచి, కథలు పాటలు పాడిస్తూ, పుస్తకాలు చదివిస్తూ, బొమ్మలు వేయిస్తూ, సినిమాలు చూపిస్తూ కాలక్షేపం చేయాలి.

* రోజు రకరకాల ద్రవాలు తాగించి రెండు గంటలకు ఒకసారి మూత్రం సాఫీగా నడిచేలా చూడాలి.
* పిల్లల గది చుట్టూ చల్లటి గుడ్డలు వేలాడదీయాలి. రెండు పూటలా స్నానం చేయించాలి.

వేసవి సెలవులకు బంధువుల ఇండ్లకు వెళ్ళినప్పుడు, కొత్త ప్రదేశాలలో వారిని ఎక్కువగా తిరగనివ్వకూడదు. నిరంతరం కనిపెడుతూ ఉండాలి. వేసవి వచ్చిందంటే పిల్లలు దగ్గర బావులలోకి, చెరువులలోకి, కాలువలలోకి ఈతలకు వెళ్తారు. పెద్దల పర్యవేక్షణ లేకుండా ఈతకు వెళ్ళనివ్వరాదు. ప్రతి యేటా వేసవిలో బంధువుల ఇండ్లకు వెళ్లి ఎంతోమంది చిన్నారులు ఈత పేరిట మృత్యువాత పడి తమ తల్లిదండ్రులకు కడుపు కోత మిగిల్చిన విషాదంతాలు ఎన్నో చూశాం. అటువంటి విషాద సంఘటనలు జరగకుండా పెద్దలు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి.



### పరిష్కార మార్గాలు

మానవాళి ప్రకృతితో ఆడుతున్న చెలగాటంతో రోజు రోజుకు భూమిపై ఉష్ణతాపం అధికమవుతోంది. ప్రస్తుత ప్రపంచం పర్యావరణ ప్రమాదపు అంచులో ఉంది. 17వ శతాబ్దం సగ భాగం నుండి యూరప్‌లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం వలన కర్బన ఉద్గారాల విడుదల విపరీతంగా జరిగింది. దీనిని అంతా ప్రగతి అనుకున్నాం, నూతన ఆవిష్కరణలతో ఆనందపడ్డాం, కానీ ఈ చర్యల వలన పర్యావరణం కాలుష్యానికి గురై మానవ మనుగడకు ప్రమాద ఘంటికలు మోగిస్తాయని తెలుసుకోలేక పోయాం. కొంత కాలానికి తెలుసుకున్నా, కార్పొరేట్ పెట్టుబడి దారులు, సామ్రాజ్యవాదులు తమ లాభాపేక్షతో పర్యావరణ పరిరక్షణను మరచి మానవ శ్రేయస్సును విస్మరించారు.

యావత్ ప్రపంచాన్ని ఆందోళనకు గురి చేస్తున్న వాతావరణ మార్పులను అధిగమించడానికి ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల విభాగం ఆధ్వర్యంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ పేరిట ఎన్నో సదస్సులు నిర్వహించినను పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన తీర్మానాలు చర్చలు ఆశించినంతగా అమలు కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతల పెరుగుదల 1.5 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు మించిపోయే క్రమం ఆసన్నమైంది. వన్ పాయింట్ వన్ డిగ్రీ సెంటిగ్రేడ్ పెరుగుదల ఉన్న తరుణంలోనే అపార నష్టం వాటిల్లుతుంది. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించుకోవడంలో దేశాధినేతలు విఫలమయ్యారు. 19 సంవత్సరాల క్రితం జరిగిన ప్యారిస్ ఒప్పందం అమలుపై అగ్రరాజ్యాలు మోకాలు అడ్డుతుండటం బాధాకరం. వాతావరణం మార్పులకు ముఖ్య కారణమైన భూతాపాన్ని తగ్గించేందుకు ప్యారిస్ ఒప్పందం ప్రకారం అమలు చేయడంలో అనిశ్చితి నెలకొంది. అగ్ర రాజ్యాలైన అమెరికా–చైనా యూరప్ దేశాలు అధిక మోతాదులో కర్బన ఉద్గారాలను విడుదల చేస్తూ తగ్గించడానికి కంటి తుడుపు చర్యలు కూడా తీసుకోకపోవడం ఇబ్బందికరం. 2050 నాటికి సగటు భూతాపం పెరుగుదలను రెండు డిగ్రీల సెల్సియస్ ని మించకుండా చేస్తామంటూ 196 దేశాలు ప్యారిస్ ఒప్పందంలో సంతకాలు చేశాయి.

ఆ ఒప్పందం ప్రకారం తప్పకుండా కర్బన ఉద్గారాలు తగ్గించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. 2030 నాటికి 50 శాతం, 2050 నాటికి సమూలంగా కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన బాధ్యత అగ్రరాజ్యాల పైన ఉన్నది.



## తీసుకోవాల్సిన చర్యలు

* ప్రతి ఒక్కరూ తమ సొంత వాహనాలను కాకుండా ప్రజా రవాణాను ఉపయోగించాలి. బస్సులలో, రైళ్లలో, మెట్రో రైల్లో ప్రయాణించడం వల్ల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చు.

వాషింగ్ మెషిన్లు, వాటర్ హీటర్లు, ఏసీలు రిఫ్రిజిరేటర్లు వంటి ఎలక్ట్రానిక్ విద్యుత్ మీద ఆధారపడే వస్తువుల వాడకం తగ్గించి, ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించి విద్యుత్ ఆదా చేయాలి. విద్యుత్‌కు బదులు సౌర శక్తి వంటి పునరుత్పాదక శక్తి వనరులు ఉపయోగించాలి.



* పండ్లు, కూరగాయలు, పప్పులు, ధాన్యం ఉత్పత్తి కంటే మాంసం ఉత్పత్తి వల్ల గ్రీన్ హౌస్ వాయువులు ఎక్కువగా విడుదలవుతాయి. కనుక మాంసాహారాన్ని తగ్గించాలి.

* పాల ఉత్పత్తులు, పాలను తగ్గించడం వల్ల సుదూర ప్రాంతాలకు రవాణా చేయడం ఉండదు. దీంతో గ్రీన్ హౌస్ వాయువుల విడుదల ఆపవచ్చు.

* ప్లాస్టిక్ భూతాపానికి అతి పెద్ద మూలం. దీనిని రీసైక్లింగ్ చేయడానికి సంవత్సరాలు పడుతుంది. రీసైక్లింగ్ వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ రీసైకిల్ చేసే పదార్థాలను రవాణా చేయడం, వాటిని ప్రాసెసింగ్ చేయడం వంటి ప్రక్రియ వల్ల కార్బన్ ఉద్గారాలు విడుదలవుతాయి. దీనిని నివారించాలంటే ఆ వస్తువులను మళ్లీ మళ్లీ ఉపయోగించడం చేయాలి.

* గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి మనం శక్తి వినియోగాన్ని తగ్గించి గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించాలి. శిలాజ ఇంధనాలైనా పెట్రోల్, డీజిల్ వంటి వాటి వినియోగాన్ని తగ్గించాలి. వాటికి బదులుగా గ్రీన్ ఎనర్జీని అంటే సౌర శక్తి, గాలి శక్తి, నీటి శక్తి, బయోమాస్ శక్తి, భూగర్భ శక్తి వంటి వాటిని విరివిగా ఉపయోగించాలి. హరిత ఇంధనం వినియోగం పెంచడం వలన భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, శుభ్రమైన ప్రపంచాన్ని అందించగలం.

అడవుల పెంపకం, పర్యావరణాన్ని పచ్చగా ఉంచడానికి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. పారిశ్రామికీకరణ నిర్దిష్ట నియమ నిబంధనలకు లోబడి ఉండాలి. మొక్కలు, జాతులను రక్షించుకోవడానికి గ్రీన్ జోన్లలో పరిశ్రమలను నిర్మించకూడదు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు, మానవాళి మనుగడకు ఆక్సిజన్ అందించే చెట్లను పెంచినప్పుడు మాత్రమే భూతాపాన్ని తగ్గించవచ్చు.

## ముగింపు

మానవుడు స్వయంకృతాపరాధంతో తన కార్యకలాపాల చేత పర్యావరణాన్ని పాడు చేస్తుండడంతో తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు మార్పులకు లోనై ప్రకృతి కన్నెర్ర చేయడంతో పలు విపత్తులు, కొత్త కొత్త వైరస్‌లు పుట్టుకొచ్చి విధ్వంసం చేస్తున్నాయి. ఆ క్రమంలోనే కాలగమనం కూడా గతి తప్పి ప్రకృతి సమతౌల్యం దెబ్బతిన్నది.

ముందస్తుగా కాలాల మార్పిడి జరుగుతుంది. తక్షణమే ప్రతి పౌరుడు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ, ప్రజాచైతన్యం పెరిగినప్పుడు మాత్రమే గ్లోబల్ వార్మింగ్ పెనుముప్పు నుండి బయట పడవచ్చు. ✦

# దృఢ సంకల్పంతో..

**యామిజాల జగదీశ్**

**నడిస్తే చీమైనా వందయోజనాలు కూడా ప్రయాణించగలదు. నడవకుండా ఉన్నప్పుడు గరుత్మంతుడు సైతం ఒక్క అడుగు కూడా పయనించలేడు. ప్రయత్నమంటూ చేస్తే ఎవరైనా దేనినైనా సాధించగలరు.**

అమెరికా అధ్యక్షుడుగా విశేష ఖ్యాతి గడించిన అబ్రహామ్ లింకన్ 1816 నుండి 1860 వరకు అనుభవించిన కష్టనష్టాలు, జయాపజయాలు అంతులేనివి. ఆయన ఎనిమిది సార్లు దేశాధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయారు. మూడు సార్లు ఉద్యోగం పోగొట్టుకున్నారు. రెండు సార్లు వ్యాపారంలో దివాలా తీశారు.

ఆరు నెలలపాటు తీవ్ర మనస్తాపంతో కుమిలిపోయారు. పదిహేడేళ్ల పాటు ఋణగ్రస్తుడుగా జీవితం గడిపారు. అయినా ధైర్యం వీడక 1860వ సంవత్సరంలో దేశాధ్యక్ష పదవికి పోటీ చేసి ఎన్నికలలో గెలిచి అమెరికా అధ్యక్షుడయ్యాడు. బానిస వ్యవస్థ నిర్మూలన కోసం పోరాడి చరిత్రకెక్కాడు. ఆయన విజయానికి కారణం పట్టుదల అచంచల కార్యదీక్ష.

దృఢసంకల్పం ఉంటే తప్పకుండా సంకల్పసిద్ధి కలుగుతుంది. నెపోలియన్ చక్రవర్తి ఆకారంలో చాలా పొట్టి. అలాంటివాడు ప్రపంచాన్నే జయించాడు. ఉక్కులాంటి చెక్కుచెదరని అతని మనసే అందుకు కారణం.

గొప్ప వక్తగా పేరు తెచ్చుకున్న డెమస్తనీస్‌కు నత్తి సమస్య ఉండేది. ఆయన నాలుక కింద గులకరాళ్ళు ఉంచుకుని సాగర తీరంలో కేకలు వేసి తనకున్న నత్తిని పోగొట్టుకున్నాడు. మహావక్తగా నివాళులందుకున్నాడు. తన సమస్యకు అధైర్యపడక పట్టుదలతో ఆత్మవిశ్వాసంతో తనకున్న అడ్డంకిని తొలగించుకున్నాడు. ప్రజల ఎగతాళినీ, నిందలనూ లెక్క చేయకుండా బీదవాడైన బెంజమిన్ డిజ్రేలీ ఇంగ్లండు ప్రధాని కావడం ఆయన ఆత్మవిశ్వాసం, పట్టుదలకు నిదర్శనం.

జన, హితాభిలాషి అయిన గిడుగు రామ్మూర్తి గారి దీక్ష, పట్టుదల నేటి యువతరానికి స్ఫూర్తిదాయకం. వారు తన అనారోగ్య పరిస్థితులను లెక్క చేయక, సవరలు నివసించే మన్య ప్రాంతాలలో తిరిగి వారి భాష నేర్చుకుని లిపి లేని ఆ భాషకు తెలుగులో లిపి రాసి మొట్టమొదటిసారిగా దానికి వ్యాకరణ గ్రంథం రచించారు.

ఆ గిరిజనులకు వారు చేసిన సేవను అప్పటి మద్రాసు ప్రభుత్వం గుర్తించి 'రావుసాహెబ్' అనే బిరుదుతో సత్కరించింది. పంతులుగారు తెలుగు వ్యావహారిక భాషోద్యమ పితామహుడుగా పేరుగాంచారు.

వారు చేపట్టిన అనేక సంఘసేవా కార్యక్రమాలు వారి ఆదర్శాలకు ఉన్నతమైన భావాలకు నిదర్శనం.

మన సనాతన గ్రంథాలలో కార్యదక్షత, కర్మశీలతపై ఎంతో అధ్యయనం చేసి ఆచరణ యోగ్యమైన సూత్రాలను అందించారు. ఒక్కసారి రామాయణాన్ని పరిశీలిస్తే నిలువెత్తు ఆదర్శాలు కోకొల్లలుగా కనిపిస్తాయి.



బుద్ధిమంతుడు, మహావాగ్మి, కార్యదక్షుడు, బలశాలి అయిన హనుమంతుని వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తే కార్యసాఫల్యానికి కావలసిన లక్షణాలు అవగతమవుతాయి. సముద్ర లంఘనం చేసిన హనుమను కీర్తిస్తూ దేవతలు చెప్పిన మాటలు:

ధృతిః మతిః దాక్ష్యం సకర్మ సునసీదతి ధృతి.. అంటే పట్టుదల, దృష్టి అంటే ఏకాగ్రత మతి అంటే బుద్ధి బలం, దాక్ష్యం సమర్థతను తెలియజేస్తుంది. ఈ నాలుగు లక్షణాలు ఎవరికి ఉంటాయో విజయం వారిని వరిస్తుంది. వాల్మీకి చెప్పిన ఓ అద్భుత విజయ సూత్రం.

"నిరుత్సాహంతో దిగాలుగా ఏ పని చేసినా అది ఫలించదు. పైగా అది దుఃఖానికి హేతువు అవుతుంది. చురుకుదనం, ఆనందం.. ఈ రెండే కార్యసాఫల్యానికి హేతువు".

ఈ విషయం విద్యార్థి దశ నుండి గుర్తుంచుకొంటే చకనకని భవిష్యత్తు సాధించవచ్చు.

## ఆత్మవిశ్వాసం

మహాభారతంలో ఓ చిన్న పాత్ర అనూరుడు. అతడు పుట్టుకతోనే రెండు కాళ్ళు లేనివాడు. ప్రత్యక్ష భగవానుడే సూర్యుడికి రథసారథిగా ఎదిగినవాడు. అంగవైకల్యం బాహ్యశరీరానికే కానీ, ఆత్మశక్తికి కాదని నిరూపించిన ధీశాలి.

ఆత్మస్థైర్యం ఉండి, సంకల్ప బలం ఉంటే కన్ను, కాలు, చేయి.. ఇలా ఏ అవయవం లేకపోయినా జీవితంలో అత్యున్నత స్థితిని చేరుకోవచ్చని చెప్పే కథ అనూరుడి వృత్తాంతం.

సాధారణంగా మనందరం మనలో ఏదో ఒక లోపాన్ని చూసుకుని బాధ పడుతూ ఉంటాం. ఉద్యోగం లేదని ఒకరు, పెళ్ళి కాలేదని ఒకరు, సొంత ఇల్లు లేదని మరొకరు, పరీక్ష తప్పామని ఇంకొకరు, డబ్బులు లేవని మరొకరు, అందం లేదని ఇంకొకరు... ఇలా ఏదో ఒక లోపం చూసుకుని మనస్తాపం చెందుతూ ఉంటారు. అయితే ఇవన్నీ మనం అనుకున్నట్టు నిజంగా లోపాలేనా? ఉద్యోగం, డబ్బు, పదవి, అధికారం, హోదా, ఇవన్నీ మనిషికి నిజమైన సంతోషాన్ని ఇస్తాయా?

# నీతో పడవ ప్రయాణం



నేనిప్పుడు
నీ జ్ఞాపకాలతో పడవ ప్రయాణం
చేస్తున్నాను.
ఏటు ఒడ్డున
ఆగి
ఇసుక
గూళ్లల్లో దాగి
నీ పరిమళ
సుగంధాన్ని పీల్చుకుంటున్నాను.
నీ వొడిలో వాలి
నక్షత్రాల్ని లెక్కపెట్టడం
నీ కౌగిలిలో
క్షణాలు ఆగిపోవడం.
అలా
ఊపిరి సలపని
జ్ఞాపకాలతో నలిగిపోతున్నాను.
నేను నిశ్చలంగా ఉండలేను
కొలమానాల కారణంగా
దూరంగా సాగిపోయావు.
చిన్ని జీవితానికి
వెన్నెల జ్ఞాపకాలు
వేదన రోదనలు తప్పా
మాటల స్పర్శే లేని
ఒంటరి జీవితాలకి
జ్ఞాపకాలు
చెరో దిక్కున సాగుతాయి.
కలలు కనే వయసులో
ఆత్మీయ లోకంలో జీవించాను.
క్షణాల్ని పోగుచేసి
నీ కోసం ప్రేమ వారధి నిర్మించాను.
నా గుండె
గుడిలో
దీపాలు
వెలిగిస్తావనీ....
ఇప్పుడు చెప్పు
గాయపరిచిన గొంతు కాలానిదా
ఆర్థిక బంధాలదా....
నాకు తెలీదు కానీ
నిన్ను కళ్ళల్లో
వెలిగించుకోవటం తప్పా.
నీతో సాగిన పడవ ప్రయాణాల్ని
కళ్ళలో నడిపించుకోవటం తప్పా
నాకింకేమీ తెలీదు...!

**– గవిడి శ్రీనివాస్**

# సముద్రం-ప్రేమ

నువ్వు ఒక సముద్రం
నేను ఒక కవిత్వం
నువ్వు నీ భావాలను
అలల రూపంలో ప్రకటిస్తావు
నేను నా భావాలను
అక్షరాల ఉద్ధృతిలో ప్రకటిస్తాను
నువ్వు ఎప్పటికీ ఇంకిపోవు
నాలోని భావావేశపు ఆశ
ఎప్పటికీ ఇంకిపోదు
నువ్వు ఒక తపస్సు
నీవొక విశాలం.. నేనొక విషాదం
నువ్వు ఒక ప్రతాపం
నేను ఒక పశ్చాత్తాపం
నువ్వు అడుగున నిశ్చలంగా ఉండి
పైన అలజడి సృష్టిస్తే
నాలోని మనోభావాలలో అలజడి పెరిగి
నిశ్శబ్దంగా భావాలు ప్రకటిస్తాను
నువ్వు ఒక సునామీ.. నేను ఒక షరాబీ
నువ్వు ఒక ప్రవాహం..
నేను ఒక విప్లవం.

**– చల్లా రమేష్ కుమార్**

# శ్రీరామ

సీతామనోభిరాముడు
జగత్కల్యాణ
పరంధాముడు
భవసాగర తరంగాల
పయనింపచేసే దేవుడు
ధర్మప్రతిష్టాపనా
బాంధవుడు
ఒకే పత్ని
ఒకే మాట
ఒకే బాణం
దశరథుని
యాగఫలమో
కౌసల్య నోముల కలిమో
సీతమ్మ సౌభాగ్యమో
అన్నదమ్ముల
అనురాగమో
కౌశికుని
ఆశీర్వాదాంతర్యమో
శబరి ఎంగిలి బలమో
హనుమభక్తి పరవశమో
గుహుని
సేవాంతరంగమో
వాల్మీకి
రామాయణామృతమో
కొండంత దేవుడు గుండె
నిండుకున్నాడు
రామ రామ రామ అంటే
జీవన్ముక్తికి తారకం
శ్రీరామ చంద్రా
నీ తలపే మాకు
శ్రీరామరక్ష..

**– ఎ.ఎస్.ప్రభాకర్**

## ఈ వారం కవిత్వం

# జ్ఞాపకం

చెలీ!
నువ్వు నడచిన దారిలో
గుర్తుల గులాబీలు
కనిపిస్తుంటే
జ్ఞాపకాలు తొలుస్తున్నాయి
నువ్వు కూర్చున్న చోటులో
జ్ఞాపకాల జాజులు
వికసిస్తుంటే
స్మృతులు సొద పెడుతున్నాయి


నువ్వు నిల్చున్న స్థలంలో
కొమ్మలు ఊసులాడుతూ
ఊగిసలాడుతుంటే
గతం ఆలోచనలు గుండెలో
గుప్పుమంటున్నాయి.

నువ్వు ఊసులాడిన ప్రదేశంలో
పక్షుల కువకువలు
వినిపిస్తుంటే
మొన్నటి మధురిమలు మదిని
చుట్టేస్తున్నాయి

అలా...

ఆనాటి తియ్యటి రోజులు
ఆశల అల్లర్లు
ఆపేక్షి స్తున్నాయి
పదే పదే మనసును
పరుగు పెట్టిస్తున్నాయి
నువ్వు గడిపిన పూదోటలో మరలా
నువ్వు నడయాడాలని..

మళ్లీ వచ్చేనా నాటి వసంతం..!!
మనసుకు పంచేనా సుగంధం..!!



# నవమి రుచులు

## పానకం



**కావలసిన పదార్థాలు :** బెల్లం-3 కప్పులు, మిరియాల పొడి-3 టీ స్పూన్లు ఉప్పు- చిటికెడు, శొంఠి పొడి-టీ స్పూన్, నిమ్మరసం- మూడు టీ స్పూన్లు, నీళ్లు : 9 కప్పులు.

**తయారీ విధానం :** ముందు బెల్లాన్ని మెత్తగా కొట్టుకుని, నీళ్లలో కలుపుకోవాలి. బెల్లం మొత్తం కరిగాక పలుచని క్లాత్‌లో వడకట్టాలి. ఇందులో మిరియాల పొడి, శొంఠి పొడి, ఉప్పు, యాలకులపొడి, నిమ్మరసం వేసి బాగా కలపాలి. అంతే పానకం సిద్ధం.

## మామిడికాయ పులిహోర




**కావలసినవి :** బియ్యం- రెండు కప్పులు, పచ్చిమామిడికాయ- ఒకటి, నూనె-రెండు టేబుల్ స్పూన్లు, ఆవాలు- ఒక టీస్పూన్, ఇంగువ-చిటికెడు, ఎండుమిర్చి-ఒకటి, మినప్పప్పు-ఒక టీస్పూన్, శనగపప్పు-ఒక టేబుల్‌స్పూన్, పచ్చిమిర్చి-రెండు, ఉప్పు-రుచికి తగినంత, పసుపు-చిటికెడు, కరివేపాకు-రెండు రెమ్మలు, వేరుశనగలు- ఒక టేబుల్ స్పూన్.

**తయారీ విధానం :** ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్న వండుకోవాలి. తరువాత ఒక వెడల్పాటి ప్లేట్‌లోకి తీసుకుని చల్లార బెట్టుకోవాలి. ఒక బౌల్‌లో మామిడికాయ తురుము తీసుకుని కొద్దిగా పసుపు, కొద్దిగా ఉప్పు కలిపి పక్కన పెట్టుకవోవాలి. స్టవ్‌పై పాన్ పెట్టి కొద్దిగా నూనె పోసి వేడి అయ్యాక ఆవాలు. ఎండుమిర్చి వేయాలి. తరువాత ఇంగువ, మినపప్పు, శనగపప్పు, వేరుశనగలు, పచ్చిమర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఈ పోపు అన్నంలో కలుపుకోవాలి. తరువాత మామిడికాయ తురుము వేసి కలియబెట్టుకోవాలి. రుచికి తగిన ఉప్పు వేసుకుని వడ్డించుకోవాలి.

## వడపప్పు

**కావలసిన పదార్థాలు :** పెసరపప్పు- కప్పు కీరా- ఒక ముక్క, పచ్చిమిర్చి-1 (తరగాలి), కొత్తిమీర తరుగు -టీ స్పూన్, కొబ్బరి తురుము- టేబుల్ స్పూన్ ఉప్పు-తగినంత.




**తయారీ విధానం :** పెసరపప్పును నాలుగు గంటలు నీళ్లలో నానబెట్టాలి. నీటిని వడకట్టేసి, పప్పు ఒక గిన్నెలో వేయాలి. దాంట్లో కీరా తరుగు, పచ్చిమిర్చి కొత్తిమీర, కొబ్బరి, ఉప్పు వేసి కలపితే వడపప్పు రెడి అయినట్లే ఈ ప్రసాదాలను స్వామి వారికి నివేదన చేసి భక్తులకు వితరణ చేయాలి.

## మామిడి మిరియాల చారు

**కావాల్సినవి :** మీడియం సైజు మామిడికాయ-ఒకటి, కందిపప్పు-పావు కప్పు, ఉప్పు-తగినంత, మిరియాలు-చెంచా, పసుపు చిటికెడు, మెంతులు- అరచెంచా, జీలకర్ర-చెంచా, వెల్లుల్లి రెబ్బలు- అయిదు, ఆవాలు-కొద్దిగా, కరివేపాకు-కొద్దిగా, ఇంగువ-చిటికెడు, నూనె, ఎండుమిర్చి-తాలింపులోకి సరిపడా.

**తయారీ :** మామిడికాయకు చాకుతో గాట్లు పెట్టినఒక గిన్నె ఉంచి దాంట్లో సగం వరకు నీళ్లు పోయాలి. స్టౌ మీద సిమ్‌లో ఉడికించు కోవాలి. పప్పును కుక్కర్‌లో వేసి తగినన్ని నీళ్లు పోసి మెత్తగా ఉడికించి, మెదిపి పక్కన పెట్టుకోవాలి. మామిడికాయ చల్లారాక పొట్టు తీసేసి గుజ్జుని చేత్తో మెత్తగా మెదపాలి. కడాయిలో మిరియాలు, ఎండుమిర్చి, మెంతులు దోరగా వేయించి మిక్సీ పట్టుకోవాలి. తాలింపు వేయడానికి పాత్ర పెట్టుకొని నూనె వేసి వేడియ్యాక జీలకర్ర, ఆవాలు, వెల్లుల్లి,రెండు ఎండుమిర్చి, వేసి అవి వేగాక కరివేపాకు ఇంగువ వేయ్యాలి. దీంట్లో మెదిపి పెట్టుకున్న పప్పు, మామిడికాయ గుజ్జు తగినన్ని నీళ్లు, పసుపు వేసి బాగా కలపాలి. ఎండుమిర్చి మిరియాల పొడి వేసి మూత పెట్టుకొని పది నిమిషాలు మరిగించాలి. చివర్లో కొత్తిమీర వేసుకుని సర్వ్ చేసుకుంటే సరి.



# ఆదరణ కోల్పోతున్న 'విలువిద్య'

కోట దామోదర్

రామాయణం, మహాభారతంలో ధనుర్విద్య (విలువిద్య) గురించి ఎంతో గొప్పగా ప్రస్తావించబడింది. యుద్ధాలలో శత్రు సైన్యాన్ని ఎదుర్కొనేందుకు విలువిద్యను ప్రత్యేకంగా ఉపయోగించారని పురాణాలు చెబుతున్నాయి. స్వయంవరంలో మత్స్య యంత్రాన్ని ఛేదించిన అర్జునుడు, శివ ధనుస్సును విరిచి సీతను పెళ్లాడిన శ్రీరాముడు, వీరంతా విలువిద్యలో నిష్ణాతులే. అంతేకాదు, విలువిద్యంటే అమితాసక్తి గల ఏకలవ్యుడికి విలువిద్యలో నిష్ణాతుడైన ద్రోణాచార్యుడి దగ్గర విద్య అభ్యసించాలనే కోరిక ప్రబలంగా ఉండేది. కానీ క్షత్రియేతరుడైన ఏకలవ్యుడికి విలువిద్య నేర్పడానికి ద్రోణాచార్యుడు నిరాకరించ డంతో అతడు ఏమాత్రం కలత చెందక మట్టితో ద్రోణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొని ఆ ప్రతిమనే గురువుగా భావిస్తూ పట్టుదలతో విద్యనభ్యసించి ద్రోణాచార్యుని ప్రియశిష్యుడు, మేటి విలుకాడైన అర్జునున్ని కూడా మించిపోయాడు. ఏడు బాణాలు ఒకేసారి సంధించి కొట్టడంలో ఏకలవ్యుడిని మించినవారు లేరనడంలో అతిశయోక్తి లేదు. అకుంఠిత దీక్షతో విద్యనభ్యసించిన ఏకలవ్యుడు ఎంతో మందికి ఆదర్శం.

విలువిద్య అనేది పురాణాలలో మాత్రమే కాదు, ఆదిమ మానవుడు ఆహారం కోసం జంతువులను వేటాడేందుకు పూర్వ కాలంలో రాజులు శత్రుసైన్యంతో పోరాడేందుకు యుద్ధాల్లో విలువిద్యను ఉపయోగించారన్న సంగతి మనందరికీ తెలిసిందే.



మన్యం ప్రజల హక్కుల కోసం, భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిషర్ల గుండెల్లో బాణాలు వదిలి శత్రుసైన్యాన్ని గడగడలాడించిన అసమాన పోరాట యోధుడు, మాన్యం వీరుడు. అగ్గిపిడుగు అల్లూరి. తన 27వ యేటనే ప్రాణత్యాగం చేసిన విప్లవ జ్వాల అల్లూరి సీతారామరాజు విలువిద్యలో ప్రావీణ్యం సంపాదించినవారే. అంతేకాకుండా, బాణం ప్రతిచర్య, స్ఫూర్తి ఆధారంగానే ఆధునిక క్షిపణి ఆవిష్కరింపబడిందన్న విషయం కూడా ప్రచారంలో ఉంది. ఎన్నో వేల సంవత్సరాల క్రితమే విలువిద్య భారతదేశంలో ప్రాచుర్యంలో ఉందని మన దేశమే దీనికి పుట్టిల్లని భారతీయులు ప్రగాఢంగా విశ్వసించినప్పటికీ ఈ క్రీడ ఎందుకు నిరాదరణకు గురవుతోందో అర్థం కాదు. అయితే ఈ క్రీడ భూటాన్, జపాన్, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాల్లో ఎంతో ప్రసిద్ధి చెందడం ఆశ్చర్యకరం.

### కారణాలు

1. ఒలింపిక్ క్రీడలలో ఒకటైన విలువిద్యను ఇతర క్రీడలతో సమానంగా ప్రభుత్వం ప్రోత్సహించకపోవడం. ఈ క్రీడను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రభుత్వం విఫలమైంది. అందుకు ప్రభుత్వం తగినన్ని చర్యలు తీసుకుంటే మన దేశంలో కూడా ప్రాచుర్యం పొందే అవకాశముంది.

2. యువతకు ఈ క్రీడపై సరైన అవగాహన లేకపోవడం, ఔత్సాహిక క్రీడాకారులకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఉచిత శిక్షణా కేంద్రాలు అందుబాటు లేకపోవడం పాఠ్యపుస్తకాల్లో ప్రస్తావన లేకపోవడం ఈ క్రీడాభివృద్ధికి అవరోధంగా ఉంటున్నాయి. అందుకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో విలువిద్య విలువల గురుంచి విద్యార్థులకు తెలియజేయాలి.

3. ఈ క్రీడ అధిక వ్యయంతో కూడుకున్నది కావడంతో నైపుణ్యం కలిగిన ఆర్చర్లు ఎందరో ఉన్నప్పటికీ నేర్చుకోవడానికి యువత విముఖత చూపుతోంది.

4. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్ మాదిరిగానే ప్రజల్లో అవగాహన లేకపోవడం కూడా ప్రధాన సమస్య. అందుకు ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి, విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి. ఎలక్ట్రానిక్ మీడియా ప్రసార, ప్రచార సాధనాలు క్రియా శీలపాత్ర పోషించాలి.

### మొదటిసారిగా ఒలింపిక్ క్రీడాలలో...

పారిస్‌లో జరిగిన ఒలింపిక్ క్రీడలలో భాగమైన విలువిద్య 1904, 1908, 1920లలో కొనసాగి ఆపై 52 సంవత్సరాల విరామం తర్వాత 1972 నుండి ఇప్పటివరకు కొనసాగుతుండడం గొప్ప విషయం. లార్స్ ఆండర్సన్ 4.9 సెకన్లలో 10 బాణాలను సంధించి అతివేగంతో కొట్టడంలో ప్రపంచ రికార్డును సృష్టించిన ఘనుడు. విలువిద్యను 1972 మ్యూనిచ్ గేమ్స్‌లో భారతదేశం మొదట ఒలింపిక్ విభాగంగా ఎంపిక చేసింది. తరువాత 1973లో ప్రారంభించబడింది. అప్పటి ఢిల్లీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సెలర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ మల్హోత్రా ఉత్సాహంతో ఆర్చరీ భారతదేశంలో ప్రాచుర్యం పొందింది. భారతదేశంలో మొదటి సీనియర్ జాతీయ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ఏప్రిల్, 1973లో ఢిల్లీలో జరిగింది, ఇందులో దాదాపు 50 మంది పురుష, మహిళా ఆర్చర్లు పాల్గొన్నారు. అందులో బెంగాల్ ఆర్చర్లు తమ అత్యుత్తమ ప్రతిభను కనబర్చి అగ్ర స్థానంలో నిలిచారు.

### విలువిద్య క్రీడాకారుల ఘనత

రాజస్థాన్‌కు చెందిన లింబా రామ్, 20 యేళ్లలోపు జూనియర్, సీనియర్ విభాగాలలో జాతీయ ఛాంపియన్ షిప్‌లను గెలుచుకున్నాడు. దేశంలోనే మొదటి విలువిద్య నైపుణ్యమున్న వ్యక్తిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు. 1991లో భారత ప్రభుత్వంచేత అర్జున అవార్డు అందుకున్న మొదటి క్రీడాకారుడు కావడం విశేషం. 1987లో జాతీయ స్థాయి జూనియర్ ఆర్చరీ టోర్నమెంట్లలో ఛాంపియన్గా నిలిచి 1989 ఆసియా క్రీడలలో బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. 2012లో పద్మశ్రీని అందుకున్నాడు.

కోల్‌కతాకు చెందిన దోలా బెనర్జీ భారతదేశపు ప్రముఖ ఆర్చరీ క్రీడాకారిణి. బారానగర్ ఆర్చరీ క్లబ్‌లో చేరి తొమ్మిదేళ్ల వయసులో శిక్షణ ప్రారంభించిన ఆమె 1996లో శాన్ డియాగోలో జరిగిన వరల్డ్ యూత్ ఛాంపియన్స్ కప్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడం ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. 2005లో భారత ప్రభుత్వం ఆమెను అర్జున అవార్డుతో సత్కరించింది. ప్రపంచకప్ స్టేజ్1 టోర్నీలో మన క్రీడాకారులు మూడు పతకాలు సాధించారు. రికర్వ్ టీమ్ విభాగంలో దీపికా కుమారి, బొంబేలా దేవి, లక్ష్మీరాణిలతో కూడిన భారత మహిళల జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకొని తమ సత్తాచాటారు.

జయంత తాలుక్‌దార్, మంగళ్ సింగ్, అతాను దాస్‌లతో కూడిన భారత పురుషుల జట్టు ఎన్నో అవార్డులు సాధించారు. ఇలాంటి క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా వుంది. జార్ఖండ్‌లోని రాంచీకి చెందిన దీపికా కుమారి చిన్నతనంలో రాళ్లతో మామిడి పండ్లను లక్ష్యంగా చేసుకుని విలువిద్యను అభ్యసించాలనుకుంది. ఆమె తన శిక్షణ కోసం కొత్త పరికరాలను కొనుగోలు చేయడానికి ఆర్థిక పరిమితులతో రాజీ పడేవారు. దీంతో దీపిక ఇంట్లోనే వెదురుతో చేసిన బాణాలను ఉపయోగించి విలువిద్యను అభ్యసించింది. ఆమెకు 2012లో భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ద్వారా భారతదేశపు రెండవ అత్యున్నత క్రీడా పురస్కారం అర్జున అవార్డు లభించింది. ఫిబ్రవరి 2014లో, ఆమె FICCI స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డుతో సత్కరించింది. భారత ప్రభుత్వం ఆమెకు 2016లో పద్మశ్రీ పౌర గౌరవాన్ని ప్రదానం చేసింది.

తెలంగాణ రాష్ట్రం, వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన ప్రణీత వర్దినేని చిన్నప్పటి నుంచి విలువిద్యపై ఆసక్తితో కల్లెడ రూరల్ పాఠశాలలో ఆర్చరీ నేర్చుకొని 2004లో జాతీయ సబ్ జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించింది. ప్రణీత వర్థినేని ఇప్పటివరకు పన్నెండు జాతీయ స్థాయి ఆర్చరీ పోటీల్లో పాల్గొని పదకొండు పతకాలు సాధించింది.

## గణాంకాల ప్రకారం

2021 గణాంకాల ప్రకారం విలువిద్య ఏడవ అత్యంత ప్రజాదరణ పొందిన ఒలింపిక్ క్రీడగా గుర్తించబడింది. జనాదరణ పొందిన దేశాలలో ఉత్తర కొరియా, అమెరికా, బెల్జియం, ఫ్రాన్స్, ఇటలీ, చైనా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, జపాన్ మరియు స్పెయిన్ వంటి దేశాలున్నప్పటికీ భారతదేశానికి ఆ జాబితాలో చోటు దక్కకపోవడం చాలా విచారకరం. 2021 గణాంకాల ప్రకారం, మన దేశంలో 23 మంది మహిళా అథ్లెట్లు ఒలింపిక్ పోటీల్లో పాల్గొనగా, 18 మంది పురుషులు పాల్గొన్నారు. షార్జాలో జరిగిన ఆసియా కప్ 3వ దశలో భారత ఆర్చర్లు ఐదు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్యాలతో 10 పతకాలు సాధించారు. సంఖ్యా పరంగా తక్కువ మంది ఆర్చర్లు ఉన్నప్పటికీ మన దేశానికి మంచి అవార్డులు రావడం గర్వించదగ్గ విషయం.

## ఆరోగ్యానికి మేలు

చేతి-కంటి సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. ఆటగాడు బాణాన్ని గురిపెట్టి ఛేదించడం వల్ల మన కంటి దృష్టి కూడా పెరుగుతుంది. విలువిద్య సాధన చేయడం వలన సమన్వయం మెరుగుపడుతుంది. లక్ష్యం చేస్తున్నప్పుడు ఆటగాడు శరీరంపై నియంత్రణ పాటించడం వలన మెరుగ్గా ఉంటాడు. ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు శరీర భాగాలని కదిలించాల్సి అవసరం ఉంటుంది. ముఖ్యంగా చేతులు, ఛాతీ, భుజాలు. స్ట్రింగ్ విడుదల కావడానికి ముందు కండరాలపై ఉద్రిక్తత చాలా సెకన్ల పాటు నిర్వహించబడుతుంది. విలువిద్య మరింత సహనాన్ని పెంపొందించడానికి సహాయపడుతుంది. ఈ క్రీడకు అపారమైన ఓపిక అవసరం. లక్ష్యం ఛేదించడానికి ఆటగాడు బౌస్ట్రింగ్‌ను స్థిరంగా విడుదల చేయడానికి ప్రధానంగా దృష్టి పైన ఆధారపడి ఉంటుంది. విలువిద్య వల్ల దృష్టిని మెరుగుపరుస్తుంది. విశ్వాసాన్ని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని వదిలించుకోవడానికి మిమ్మల్ని రిలాక్స్‌గా భావించడంలో సహాయపడుతుంది.



## చేతి వశ్యత

విలువిద్యలో వేలు చేతి బలం పెరుగుతుంది. సాధన చేస్తున్నప్పుడు అవి పూర్తిగా ఉపయోగంలో ఉన్నందున ఫ్లెక్సిబిలిటీ కూడా పెరుగుతుంది. కేరళలోని వాయనాడ్ అడవుల్లో నివసించే కె.గోవిందన్ అనే వ్యక్తి తన పూర్వీకులు ఒకప్పుడు వేట కోసం ఉపయోగించిన శతాబ్దాల నాటి విలువిద్య పద్ధతిని ఇప్పటికీ పాటిస్తుండడం అభినందనీయం. అంతరించిపోతున్న కళను కాపాడాలనే ఉద్దేశంతో యువతరానికి ఈ విద్యను అందించాలని నిశ్చయించుకున్నాడు. తనను చూడడానికి, బోధనలు నేర్చుకునేందుకు ప్రపంచం నలుమూలల నుంచి ప్రజలు రావడం సంతోషంగా ఉన్నప్పటికీ తన పాత ఆర్చరీ పద్ధతులను నేర్చుకోవడానికి తన సామాజిక వర్గంలో చాలా మంది యువకులు ఆసక్తి చూపడం లేదని ఆయన ఆవేదన చెందుతున్నారు.

ఇప్పటికి తెలంగాణ రాష్ట్రంలో ఆదిలాబాద్, భద్రాచలం, నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గోండు, చెంచు, కోయ, మొదలైన అడవి జాతులవారు ఈ విలువిద్యను కొనసాగిస్తుండటం గొప్ప విషయం. విలువిద్యను ఒకప్పుడు ఆహారం కోసం జంతువుల వేటాడటం కోసం ఉపయోగిస్తే, ఇప్పుడు వన్యమృగాల నుండి ప్రాణ రక్షణ కొరకు ఉపయోగిస్తున్నారు.


ఆదివాసుల ప్రాణ రక్షణ కోసం ప్రభుత్వం వీరికి సరైన శిక్షణ ఇప్పించాలిస్సిన అవసరం ఉంది.

లక్ష్య సాధన కొరకు ఏకలవ్యుడు చేసిన కఠోర దీక్ష ఎందరికో ఆదర్శాన్నిస్తుంది. కానీ ఇందుకు దిశా నిర్దేశం చేసేవారు లేకపోవడం శోచనీయం. హిందూ సంప్రదాయాలలో విలువిద్య గురించి ఎంతో గొప్పగా ప్రస్తావించబడిన విలువిద్యను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■

కథ

# పచ్చని రాజ్యం

పూర్వం అవంతి రాజ్యాన్ని హరిసేనుడు అనే రాజు పరిపాలిస్తుంవాడు. ప్రజలు ఎలాంటి బాధలు లేకుండా సుఖ సంతోషాలతో జీవించేవారు. ఇలా కొద్ది కాలం గడిచిన తర్వాత రాజ్యంలో వర్షాలు లేక కరువు ఏర్పడింది. చేసేది లేక రాజు పొరుగు రాజ్యాల నుండి ఆహారపు వస్తువులను దిగుమతి చేసుకున్నాడు. అయినప్పటికీ ప్రజల అవసరాలు తీరలేదు. దానికితోడు అన్ని పోటీలలో విజయఢంకా మోగించిన అవంతి రాజ్యం చిన్న రాజ్యాలతో కూడా పోటీ పడలేక వెనుకబడిపోయింది. పరిస్థితులు రోజురోజుకీ దిగజారిపోతున్నాయి. అయినా రాజు పట్టించుకోలేదు. ఈ పరిస్థితి గమనించిన రుద్ర సేనుడు అనే మంత్రి రాజుకు రాబోయే ఆపదల గురించి ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. మంత్రి సలహాలను రాజు పెడ చెవిన పెట్టారు. అయితే రాజుగారికి సభలో ప్రశ్నల పరంపర కురిపించడం అలవాటుగా ఉండేది. అది తెలిసిన మంత్రి రాజును ఒక ప్రశ్న అడగమని రాజుకు చెవిలో విన్నవించాడు. రాజు సంతోషంతో "ఆ ప్రశ్నను రేపు సభలో అడుగుతానని" చెప్పాడు. మరునాడు రాజు మంత్రిమండలి సమావేశం ఏర్పాటు చేశాడు. "నాకు ప్రశ్నలు అడగడం అంటే చాలా సరదా అని మీ అందరికి తెలుసు కదా!" అని– మహారాజు లేచి మేధావులైన మంత్రులారా! ఈ ప్రపంచంలో అన్నింటికన్నా గొప్పది ఏది? అని ప్రశ్నించాడు. ఒకరు లేచి డబ్బు అన్నారు.మరొకరు లేచి పేరు ప్రఖ్యాతులు అన్నారు. ఇంకొకరు లేచి రాజ్య విస్తరణ అన్నారు. మరొకరు లేచి పాండిత్యం అన్నారు. ఇలా ఒక్కొక్కరు ఎవరికీ తోచిన విధంగా వారు సమాధానాలు చెప్పారు. మౌనంగా ఉన్న రుద్రసేనుడి వైపు చూసి.. ఏమి "రుద్రసేనా? నా ప్రశ్నకు నీ సమాధానం ఏమిటి?" అని రాజు ప్రశ్నించాడు. "మహారాజా! అన్నింటికన్నా ముఖ్యం, గొప్పది 'ఆరోగ్యం'. అందుకు కావలసింది పరిశుభ్రత పాటించడం. ప్రకృతిని కాపాడుకోవడం వల్ల అది సాధ్యమవుతుంద"ని రుద్రసేనుడు జవాబిచ్చాడు. అయితే అది ఎలా సాధ్యమో చెప్పమని రాజు మంత్రిని కోరాడు.



రుద్రసేనుడు లేచి "మహారాజా! ఆరోగ్యం బాగుంటేనే కదా ఏదైనా సాధించేది. ఆరోగ్యం బాగా లేకుంటే ఎంత ధనం, ఆస్తిపాస్తులు ఉన్నా, ఎంత కీర్తి ప్రతిష్టలు ఉన్నా ఏం లాభం? మనం వాటన్నింటినీ అనుభవించాలంటే ఆరోగ్యం ముఖ్యం" అన్నాడు. అందుకు మనం ఏం చేయాలో చెప్పమని రాజు కోరాడు. అప్పుడు రుద్రసేనుడు "రాజా! రాజ్యంలో ఉన్న కరువు కాటకాలు తొలగించాలంటే చెట్లను బాగా నాటాలి. అడవుల విస్తీర్ణం తగ్గిపోతుండడం వల్ల వర్షాలు లేక పంటలు పండడం లేదు. ప్రజలు ఆహారం దొరకక నానా ఇబ్బందులు పడుతున్నారు. రాజ్యంలో ఉన్న బాధలు పోవాలంటే ప్రకృతి పచ్చగా ఉండాలి. అప్పుడు సమృద్ధిగా వర్షాలు పడతాయి. నీరు పుష్కలంగా ఉంటుంది. పంటలు బాగా పండుతాయి. స్వచ్ఛమైన గాలి దొరుకుతుంది. అప్పుడే మన ఆరోగ్యం కూడా బాగుంటుంది. అందుకుగాను ప్రతి ఒక్కరూ పది చెట్ల చొప్పున నాటాలి. వాటిని కాపాడాలి. ఇదంతా తెలియాలంటే ప్రజలు విద్యావంతులు కావాలి" అని రుద్రసేనుడు విడమర్చి చెప్పాడు.

మరుక్షణం నుంచే రాజు మంత్రి సూచనలు అమలు చేయడం ప్రారంభించాడు. చిరకాలంలోనే రాజ్యంలో పర్యావరణం పెరిగింది. పంటలు పుష్కలంగా పండి ప్రజల బాధలు తీరాయి. రాజ్యం పూర్వ వైభవానికి వచ్చింది. రాజు సంతోషించాడు.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి





## బాలగేయం

### బాల కిరణాలు

సీతాకోక చిలుకలం
సింగారాల మొలకలం
చిరు చిరు అడుగుల
బుడతలం
సిరిసిరి మువ్వల
రవళులం
తళ తళ మెరిసే
తారకలం
కిలకిల నవ్వే
తామరలం

కుహూ కుహూ
రవాల కోకిలం
పక పక నవ్వే
చిన్నారులం
చిటపట చినుకుల
సవ్వడులం

చక చక నడిచే
బాలకులం
ఉదయకాల రవి
కిరణాలం
హృదయ మున్న
కవి కావ్యాలం

– గుండాల
నరేంద్ర బాబు



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

### గిరీష్ అంకుల్ సమాధానాలు

**పుష్పలత, శ్రీకాకుళం**

**ప్రశ్న: కంప్యూటర్ వైరస్ అంటే ఏమిటి?**

**జవాబు:** కంప్యూటర్ వైరస్ అనేది ఒక రకమైన ప్రోగ్రామ్. ఎటువంటి కమాండ్‌తో నిమిత్తం లేకుండానే తనంతట తాను కంప్యూటర్‌ను తొలచివేయడం ఈ ప్రోగ్రామ్ ప్రత్యేకత. హార్డ్ డిస్క్, ఫ్లాపీ డిస్క్‌లుగా పిలిచే సిస్టమ్ ఏరియాలోకి ప్రవేశించిన వైరస్ అందులోని ప్రోగ్రామింగ్ ఫైల్స్ అన్నింటినీ కాపీ చేస్తుంది. అలా కాపీ చేసిన ఫైళ్లను ధ్వంసం చేసి మరిన్ని ఫైళ్లను కాపీ చేస్తుంది. ఈ రకంగా కంప్యూటర్‌లోని అన్ని విభాగాలకు విస్తరించి మొత్తం సిస్టమ్‌ను ధ్వంసం చేయడమే వైరస్‌ల ప్రత్యేకత. వార్మ్స్ / ట్రోజాన్స్ వంటి రకాల వైరస్‌లలో కొన్ని మెయిల్స్ రూపంలో కంప్యూటర్‌లోకి ప్రవేశిస్తాయి. మెయిల్‌ను ఓపెన్ చేయగానే అవి కంప్యూటర్‌లోని ప్రోగ్రామ్ ఫైళ్లను ధ్వంసం చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాయి. కొన్ని వైరస్‌లు హార్డ్ డ్రైవ్స్ మీద కూడా విశృంఖలంగా దాడిచేసి, పనితీరును అదుపులో ఉంచుకుంటాయి.

**సునంద, ఆదిలాబాద్**

**ప్రశ్న: వాన పడే ముందు మబ్బులు నల్లగా ఎందుకు ఉంటాయి?**

**జవాబు:** వర్షం పడే ముందు మబ్బులు ఎక్కువగా సూర్యకాంతిని గ్రహిస్తాయి. అందువల్ల అవి నల్లగా మారతాయి. చిన్న చిన్న నీటి బిందువులతో మబ్బులు ఏర్పడతాయి. వీటి మీద కాంతి ప్రసరించినపుడు ఆ బిందువులు పరావర్తనం చెందుతాయి. అందువల్ల మబ్బులు తెల్లగా కనిపిస్తాయి.

వాన పడే ముందు నీటి బిందువుల సంఖ్య పెరుగుతుంది. అందువల్ల కాంతి అధికంగా పరావర్తనం చెందదు. ఈ దృష్ట్యా, వాన పడేముందు మబ్బులు నల్లగా కనిపిస్తాయి.



# ఆ చెట్టే ఓ అడవి

నెలవెట్ల సతీష్‌కుమార్ రెడ్డి

**ఏడు శతాబ్దాలకు పైగా చరిత్ర.. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అడవిగా ఏర్పడి.. నేటికీ మొదలు ఎక్కడో తెలియని అంతుపట్టని ఓ మహావృక్షంగా..మహబూబ్‌నగర్ ఐకాన్‌గా చరిత్రకెక్కిక ఓ మహావృక్షం పిల్లలమర్రి.**

ఏమైందో తెలియదుగానీ పిల్లలమర్రికి చెదలు పట్టి ఒక్కో కొమ్మ విరిగిపడుతూ ఆకులు ఒక్కొక్కటిగా నేల రాలుతుంటే చూసిన ఏ ఒక్కరు కూడా జీర్ణించుకోలేకపోయారు. కంట తడి పెట్టిన పర్యాటకులు సైతం కంటతడి పెట్టిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆ మహావృక్షంతో పాలమూరుకు వున్న అనుబంధం విడదీయలేదనిది. ఒదిగిన చోటే ఎదగాలని సభ్యసమాజానికి చెబుతూ మళ్లీ జీవం పోసుకొని సందర్శకులకు స్వాగతం పలుకుతోంది.

700 యేళ్ల చరిత్ర కలిగిన పిల్లలమర్రి ప్రతికూల పరిస్థితులను తట్టుకుని మళ్లీ జీవం పోసుకున్నది. ఆరేళ్లుగా తీసుకుంటున్న చర్యలతో ఈ చెట్టు మళ్లీ ప్రాణం పోసుకుని సందర్శకులకు స్వాగతం పలుకుతోంది. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోనే పిల్లలమర్రి ఉన్నది. ఈ మర్రిచెట్టు ఎప్పుడు పుట్టిందనే విషయంపై నేటికీ కచ్చితమైన సమాచారం లేదు. ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, తెలంగాణ టూరిజం డిపార్ట్‌మెంట్ నుంచి ఉన్న ధ్రువీకరణ మేరకు 700ఏళ్ల నాటి వృక్షం అని నిర్ధారించడం జరిగింది. భారతదేశంలోని అతిపెద్ద మర్రిచెట్లలో ఇది ఒకటని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ చెట్టు సుమారు నాలుగు ఎకరాలలో విస్తరించి ఉంది. ఈ చెట్టును మొదట పీర్ల మర్రిగా పిలిచేవారు. కాలక్రమంలో పిల్లలమర్రిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. చెట్టు శాఖోపశాఖలుగా విస్తరించడంతో దీని మొదలు ఎక్కడ అనేది తెలుసుకోలేనంతగా మారింది. తెలంగాణలోని మహబూబ్‌నగర్ శివారులో ఉండే పిల్లలమర్రి ప్రధాన శాఖ ఒకటి నేలమట్టం కావడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆర్కియాలజీ, వృక్షశాస్త్ర అధికారులు, అటవీ శాఖ అధికారులు చెట్టుకు చెదలు పట్టడంలో పరిశోధలు జరిపి, శతాబ్దాల చరిత్ర కలిగిన పిల్లలమర్రిని కాపాడుకొనేందుకు సెలైన్ సీసాలు వాడుతూ చికిత్స అందిస్తున్నారు.

## ఒకే వృక్షం..

మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ మహావృక్షానికి సుమారు 700 యేళ్లు ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. చెదలు పట్టడంతో ఇది దెబ్బతింటోంది. ఊడలు, శాఖలు విరిగిపోతున్నాయి. దీంతో, చెట్టుకు చికిత్స అందించేందుకు వృక్ష సంరక్షణ నిపుణులు వివిధ చర్యలు చేపడుతున్నారు. నిపుణులు క్లోరోఫైరఫస్ అనే చీడనివారణ మందును పిచికారీ చేయించడంతో పాటు, దానిని సెలైన్ బాటిళ్లలో నింపి చెట్టు కాండం ద్వారా వివిధ శాఖలకు అందేలా చూస్తున్నారు. చెట్టు స్థితిపై నిరంతర పర్యవేక్షణ పెట్టారు. ఈ చర్యలతో పిల్లలమర్రి క్రమంగా కోలుకుంటోంది. చెట్టుకు సారవంతమైన మట్టి, ఎరువు అందిస్తూ, క్రిమి సంహారక మందులు పోస్తూ ఆరోగ్యాన్ని సంతరించుకొనేలా ప్రయత్నాలు చేస్తున్నారు. నేల వాలుతున్న ఊడలను చీడ సోకకుండా నేరుగా భూమిలోకి పాకే విధంగా వృక్ష సంరక్షణ సిబ్బంది పైపులు ఏర్పాటు చేశారు. చెట్టు మొదళ్లు కూలకుండా సిబ్బంది సిమెంటు దిమ్మెలు ఏర్పాటు చేశారు.

## మహా మర్రికి ఏమైంది?

మర్రిచెట్టును చెదపురుగులు తొలచివేయడంతో ఒక భారీ కొమ్మ ఒకటి విరిగిపడింది. దాంతో ఆరేండ్లుగా చెట్టు వద్దకు సందర్శకులను అనుమతించడం ఆపేశారు. అప్పటి మహబూబ్‌నగర్ కలెక్టర్ రోనాల్డ్ రోస్ పిల్లలమర్రి నిర్వహణ బాధ్యతలను టూరిజం శాఖ నుంచి అటవీ శాఖకు బదలాయించారు. పిల్లలమర్రిని కాపాడేందుకు 2018 నుంచి అధికారులు నిర్విరామంగా శ్రమించారు. వివిధ దశల్లో పర్యవేక్షణ పనులు కొనసాగాయి. ప్రజలు మహా వృక్షం వద్దకు వచ్చినా తాకకుండా ఉండేలా చుట్టూ గోడ నిర్మించారు.





సందర్శకుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. చెట్టు కొమ్మలకు డ్రిల్లింగ్ చేసి క్లోరోఫైరిసిస్ ద్రావణాన్ని రంధ్రంలోకి పంపించి చికిత్స అందించారు. చెట్ట కొమ్మలు బలహీనంగా ఉండడంతో పడిపోకుండా కాంక్రీట్ స్తంభాలతో సపోర్ట్ ఇచ్చారు. అదే విధంగా పైపులతో రెండు సుమారు 150కి పైగా ఊడలు భూమిలోకి ఊడలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

## ప్రపంచంలో రెండో అతిపెద్ద మహావృక్షం

700 యేళ్ల ఘన చరిత్ర దాని సొంతం. నాలుగేళ్ల క్రితం ఊడలు ఊడిపోవడం, ఆకులు ఎండిపోవడంతో మోడుబారింది. కానీ ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు వికసించింది. ఒదిగిన చోటే ఎదిగినా చరిత్ర ముగియలేదని నిరూపించింది. ఏడు శతాబ్దాల చరిత్రగల పాలమూరు ఐకానిక్ పిల్లలమర్రి మళ్లీ జీవం పోసుకుంది. పిల్లలమర్రి పర్యాటకం పిలుస్తోంది.. ఓ సారి వెళ్లి చూసొద్దాం..

## ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి రైలు, రోడ్డు మార్గాల ద్వారా ప్రయాణా సౌకర్యం ఉన్నది. హైదరాబాద్ నుంచి సుమారు 100 కిలోమీటర్ల దూరం ఉంటుంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం ఉంటుంది, జిల్లా కేంద్రం నుంచి ప్రైవేట్ వాహనాల సౌకర్యం ఉంటుంది.



మహబూబ్‌నగర్ జిల్లా చిహ్నమైన పిల్లలమర్రి మహబూబ్ నగర్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒకపెద్ద మర్రి చెట్టు. అనేక దూర ప్రాంతాల నుంచి ఈ మహా వృక్షాన్ని చూడడానికి యాత్రికులు తరలివస్తుంటారు. ముఖ్యంగా డిసెంబరు, జనవరి మాసాలలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ఇక్కడికి వచ్చి మహా వృక్షాన్ని సందర్శిస్తారు. విహార యాత్రకు వచ్చేవారి కోసం ఇక్కడ మినీ జూ పార్కు ఉంది. రకరకాల పక్షులు, నెమళ్ళు, కుందేళ్ళు, కోతులు మున్నగునవే కాకుండా, చేపల అక్వేరియం కూడా పర్యాటకులను ఆకట్టుకొంటున్నది.

పిల్లల కోసం ఆటస్థలం ఉంది. ఇక్కడే జింకల పార్కు కూడా ఉంది. పురావస్తుశాఖ, అటవీ శాఖాధికారులు పిల్లలమర్రిని 1976లో తమ శాఖల పరిధిలోకి తీసుకున్నారు. ■

---

పుస్తక సమీక్ష

## అలరించే వ్యంగ్య వ్యాసాలు

బులుసు శ్రీవాణి 'శ్రీమతి డైరీ' వ్యంగ్య వ్యాస విన్యాసాన్ని ఇల్లాలి ముచ్చట్లుగా, హాస్యం మిళితమయ్యే వ్యంగాత్మకంగా అక్షింతలు వేయగల అరుదైన రచన. బాపు ముఖ చిత్రంలో ఒక గృహిణి పుస్తక పఠన దృశ్యం అద్భుతంగా ఆకట్టుకుంటుంది. రచయిత్రి శ్రీవాణి, తెలుగునాట ఒక కుటుంబ సౌందర్యం, ఇల్లాలి హృదయ భావనలకు ఒక చక్కటి అంతరార్థ శైలితో మనల్ని పలకరిస్తారు. సున్నితంగా మనకు తెలిసేటట్టు కాకుండా చురకలు, మందలింపులు, ఆలోచనలతో తలపింపచేస్తారు. సినిమాలు, యాత్రలు ఏ అంశమైనా, చివరకు రాజకీయాలైనా ఆమె స్పందించిన తీరుతెన్నులు చదువరులను కదిలించి ఔననిపిస్తాయి. 'సంపాదక శ్రీవారి' పాత్రను అత్యంత చమత్కారంగా రక్తి కట్టించి ప్రస్తావిస్తారు. ఇందులో 51 వ్యంగ్య కథనాలున్నాయి. ఆలోచనాత్మకమైన స్వానుభవాలను, వర్తమాన సంఘటనలను పరిశీలన, విమర్శ, సద్వివేచనతో ముచ్చట్లుగా వ్యంగ్యం, హాస్యం మిళితం చేయగల రచనా ప్రశంసనీయత, ఈ డైరీ ప్రదర్శిస్తోంది. 'నిర్భయ భారతం'లో తనదైన శైలిలో కొనసాగిస్తూనే ముక్తాయింపుగా యువతలు గౌరవ భావన కలిగే వస్త్రధారణ, లోకువ కాకుండా వుండే కలుపుగోలుతనం, బేలతనం పనికిరాని తెగువ, మృగాళ్ల పైశాచికత్వానికి బలి అయిన అబలలకు అశ్రుతర్పణం అంటూ రాయడం 'శ్రీమతి డైరీ' రచనా వైశిష్ట్య చైతన్య దర్పణంగా సామాజిక స్పృహ ప్రతిబింబింపచేస్తోంది.


**(శ్రీమతి డైరీ(వ్యంగ్య వ్యాస విన్యాసం)–బులుసు శ్రీవాణి; పేజీలు: 145; వెల: రూ.200/–, ప్రతులకు: సీతా పబ్లికేషన్స్, 101, వసుంధరా ఎన్‌క్లేవ్, నారాయణపురం, ఈదెపల్లి, మచిలీపట్నం–521 001, ఆంధ్రప్రదేశ్)**

– యర్రమిల్లి

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

***sunmagvaartha@gmail.com***



## అందాయి

### ధీర(అసామాన్య శూర)
సంపాదకురాలు: జ్యోతి వలబోజు
ప్రతులకు: నవోదయ బుక్ హౌస్
కాచీగూడ, హైదరాబాద్.

### శ్రీ గురుచరిత్ర (సంక్షిప్తం)
రచయిత: ఈశ్వరగారి నరహరి శర్మ
ప్రతులకు: ఈశ్వరగారి నరహరిశర్మ
ఆలిండియా రేడియో అండ్
దూరదర్శన్ రిటైర్డ్ కరస్పాండెంట్
జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్స్
క్యాంపస్, ఓల్డ్ మార్కెట్,
వేములవాడ–505 302.

### పూదోట
రచయిత: తిరుమల వెంకటస్వామి
ప్రతులకు: తిరుమల వెంకటస్వామి
602, పరిమళా సదన్, కమలానగర్
చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్
హైదరాబాద్.

### సక్సెస్ పోలీస్
రచన–సేకరణ:
తిప్పినేని రామదాసప్ప నాయుడు
ప్రతులకు: మెయిల్:
ramadasappanaidu@gmail.com

# మానవత్వమా! నీ మతమేంటి?

పీ.వి.యస్. కృష్ణకుమారి

కథ


**"ముప్పై సంవత్సరాల క్రితం కాశీకి , ఇప్పటి కాశీకీ ఎంతో వ్యత్యాసం కనపడుతున్నది" అన్నాడు ఫణిచంద్ర, తన స్నేహితుడు రాఘవతో.**

**"అభివృద్ధి క్రమంలో మార్పు సహజం" అన్నాడు రాఘవ.**

**"నేను అంటున్నది డెవలప్‌మెంట్ గురించి కాదు. అప్పట్లో ఇంతమంది యాత్రికులు ఉండేవారు కాదు. ఇప్పుడు పుట్టలు పుట్టలుగా ఉన్నారు జనాలు. కాశీ అంటే కేవలం పెద్దవాళ్ళే వచ్చేవాళ్ళు. కానీ ఇప్పుడు అన్ని వయసుల వాళ్లూ, చిన్న పిల్లలతో సహా కనపడుతున్నారు. భక్తి ఇంత పెరిగిపోయిందా?" అడిగాడు ఫణిచంద్ర.**

"వసతులతో పాటు టూరిజం పెరుగుతన్నది" అన్నాడు రాఘవ.

వ్యక్తిగత పనులపై అమెరికా నుంచి మూడు వారాల సెలవుపై ఇండియా వచ్చాడు ఫణిచంద్ర. అక్కడ ఒక పేరొందిన యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అతనికి, అనుకోకుండా బెనారస్ యూనివర్సిటీలో జరుగుతున్న ఒక సెమినార్‌కి విశిష్ట అతిథిగా ఆహ్వానం అందింది. అతనితో పాటు అతని మిత్రుడు రాఘవ కూడా వచ్చాడు.



ఒకరోజు ముందే వారణాసి వచ్చి, విశ్వేశ్వరుని దర్శనానంతరం, గంగాహారతి కోసం బోటులో బయలు దేరారు.

మాట్లాడుతూ ఉన్నాడే కానీ ఫణిచంద్ర మనసులో మరో వ్యక్తి రూపం, జ్ఞాపకాలు కదలాడుతున్నాయి. ఎక్కడ ఉందో ఆమె?

పడవవాడు మణికర్ణికా ఘాట్ దగ్గర ఆపి, "సార్, ఇది మణికర్ణికా ఘాట్. ఇందులో స్నానం చేస్తే మంచిది, ఇది స్నానం చేసే సమయం కాదు కాబట్టి ఆ చితి మంటలకు నమస్కారం చేసి కాళ్ల కడుక్కురండి, తర్వాత గంగాహారతికి వెళ్దాం" అన్నాడు.

"మన హిందువులందరికీ సాంప్రదాయాల మీద బాగానే అవగాహన పెరిగింది" వ్యంగ్యమో మరేదో తెలియకుండా నవ్వుతూ అన్నాడు ఫణిచంద్ర.

"సార్, నమ్మకాలు ఒక మతంలోనే ఉంటాయని అనుకోవద్దు. నేను మహమ్మదీయుడిని" అన్న పడవవాడి మాటలకి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

పడవ దిగి, నాలుగు మెట్లు పైకి ఎక్కారు. చుట్టూ పదిహేను దాకా చితి మంటలు వెలుగుతున్నాయి. వాటికి నమస్కారం చేసుకుని, తిరిగి గంగానదిలో దిగి కాళ్ళుచేతులు కడుక్కుందాం అనుకుని వెనుతిరుగుతుండగా, ఒక చల్లని వీచిక తనకి తగిలినట్లు అయి ఉలికిపాటుతో పక్కకి తిరిగాడు ఫణి.

తెల్లని చీరెలో ఒకామె తనని ఇంచుమించుగా ఆనుకుని నిలబడి, అటువైపు తిరిగి, పురోహితుడితో ఏదో మాట్లాడుతున్నది. ఆమె వైపు చూస్తూ క్షణం సేపు అలాగే నిలబడ్డాడు ఫణిచంద్ర. మాట్లాడటం అయిపోయి వెనుతిరిగిన ఆమెను పరీక్షగా చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు ఫణిచంద్ర.

"ఫాతిమా!" అప్రయత్నంగా అతని నోటినుంచి వెలువడింది మాట.

"ఫణీ!" కాసేపు తదేకంగా చూసి, అంతే ఆశ్చర్యంగా అంది ఆమె కూడా.

"నీవు వారణాసి సెమినార్‌కి వస్తున్నావని తెలుసు కానీ ఇలా , ఇక్కడ కలుసుకోవటం చిత్రంగా ఉంది" అంది.

"నీకు ఎలా తెలుసు నేను వస్తున్నట్లు?" ఆశ్చర్యంగా అడిగాడు ఫణి.

"నేను ఇదే యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేస్తున్నాను. ఈ సెమినార్ ఆర్గనైజర్స్‌లో నేను కూడా ఒకదానిని" అంటూ– "సారీ ఫణీ, నేను ఒక ముఖ్యమైన పని మీద ఉన్నాను. స్థిమితంగా మాట్లాడే సమయం కాదు. రేపు ఉదయం మా ఇంటికి రావాలి. అక్కడే బ్రేక్ ఫాస్ట్ చేసి సెమినార్‌కి అటెండ్ అవుదువు. మిస్ చేయవు కదా!" అన్నది ఫాతిమా.

ఇద్దరూ ఒకరి నంబర్ మరొకరు తీసుకున్నారు. ఫణిచంద్ర, రాఘవ తిరిగి పడవ ఎక్కారు.

అప్పటిదాకా ఇదంతా చూస్తున్న రాఘవ అడిగాడు "ఎవరు ఆమె, నీకు తెలుసా?" అని అడిగాడు.

ఏం చెప్పాలి ఆమె గురించి? ఎవరిని చెప్పాలి? మనసులో అనుకుంటూ, మెల్లగా చెప్పటం మొదలు పెట్టాడు ఫణిచంద్ర.

...............

"ఫణీ, మెడికల్ షాపు నుంచి అటూ ఇటూ వెళ్ళకుండా ఇంటికి వచ్చేయి. ఊళ్లో పరిస్థితులు బాగా లేవు" తండ్రికి జ్వరంగా ఉండటంతో మందుల కోసం బయటికి వెళుతున్న కొడుకు ఫణిచంద్రతో అన్నది అనసూయ.

ఆంధ్రా బ్యాంక్‌లో చేసే శేఖర్‌కి రెండు సంవత్సరాల క్రితం అయోధ్యకి ట్రాన్స్‌ఫర్ అయింది. అప్పుడే డిగ్రీ పూర్తి చేసిన ఫణిచంద్రని బెనారస్ యూనివర్సిటీలో పిజీలో జాయిన్ చేసాడు. ఫణిచంద్ర అక్కడ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. సెలవులు రావటంతో అయోధ్య వచ్చాడు.

ఆరోజు డిసెంబర్ ఆరవ తేదీ. రామజన్మ భూమి కోసం చేపట్టిన ర్యాలీ ముందు ప్రశాంతంగానే సాగి ఊహించని విధంగా హింసాత్మకంగా మారి బాబ్రీమసీదు కూల్చివేతకు దారితీసింది.

ఈ వార్త తెలిసిన మరుక్షణమే ముస్లింలు రంగంలోకి దిగారు. ఇరువర్గాల మధ్య హింస మొదలైంది. ఒకరినొకరు ఊచకోతకు గురిచేస్తున్నారు.

హఠాత్తుగా మొదలైన ఈ పరిణామానికి బిక్కచచ్చిపోయాడు మందుల షాపులో ఉన్న ఫణిచంద్ర. ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా పరిగెత్తసాగాడు. అయోధ్య కొత్త. అల్లరిమూకలు తరుముతుంటే ఎటు పోతున్నాడో కూడా తెలియక సందులు గొందుల కుండా పరుగెడుతున్న అతనిని హఠాత్తుగా, బురఖా వేసుకున్న ఒక చేయి ఇంట్లోకి లాగి తలుపేసింది.

ఆయాసంతో రొప్పుతున్న అతనికి "ఫికర్ మత్ కరో బేటా, పహలే పానీ లేలో" అంటూ ఒక గ్లాసుతో మంచినీళ్ళు ఇచ్చింది ఒక పెద్దావిడ. నీళ్ళు తాగిన తర్వాత రెండు నిమిషాలకి కాస్త సర్దుకున్నాడు. అప్పుడు చూసాడు తనని లోపలికి లాగిన అమ్మాయిని. అప్పటికి బురఖా తీసివేసింది.

ఎక్కడో చూసినట్లు ఉంది అనుకుంటుండగా ఆ అమ్మాయే అంది.

"మనం యూనివర్సిటీలో కలుసుకున్నాం. నా పేరు ఫాతిమా" అంది ఆ అమ్మాయి. అప్పుడు గుర్తుకొచ్చింది, ఆ అమ్మాయి పీజీ ఫిలాసఫీ చేస్తున్నది. రెండు సార్లు లైబ్రరీలో కలుసుకున్నారు.

ఎవరూ బయటికి రాలేని ఆ పరిస్థితుల్లో వాళ్ళ ఇంట్లోనే ఉంచుకుని, పరిస్థితులు సర్దుబడ్డాక, ఆమె తండ్రి జాగ్రత్తగా ఇంటి దగ్గర దిగ బెట్టాడు. కులమతాలకు అతీతంగా నిష్కల్మషమైన మనసుతో, మానవత్వంతో ఆ రోజు వాళ్ళు తనని చూసుకున్న విధానం ఇప్పటికీ మరువలేదు.

అప్పటి నుండి యూనివర్సిటీలో తరచూ కలుసుకునేవారు. ఆమె సాన్నిధ్యం అతనికి ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఫణిచంద్రకి క్రమంగా ఆమెపట్ల ప్రేమో, ఆకర్షణో తెలియని ఒక భావం చిగురించసాగింది. అయితే అది బహిర్గతం చేయాలంటే ఏదో జంకు. అసలు ఆమె ఉద్దేశం ఏమిటో తెలియదు. ఆ అంతర్మధనంలో ఉండగానే తమ చదువులు పూర్తి అయ్యాయి. చివరి రోజు ఫాతిమాకి తన మనసులో మాట చెప్పాలి అనుకున్నాడు.

అయితే ఆ రోజు ఫాతిమా కోరిక మేరకు ఇద్దరూ పడవలో గంగానదిలోకి వెళ్ళారు. అన్ని ఘాట్లు తిరిగారు. ఫణిచంద్రకి విసుగ్గా ఉంది. "ఘాట్లలో కాలుతున్న శవాలు, పడవని రాసుకుంటూ పోతున్న శవాల మధ్య ఈ విహారం ఏమిటీ?" కోపంతో అడిగాడు.

"మనం ఏమిటి అనేది ఇక్కడే తెలుస్తుంది ఫణీ. మనలోని కామ, క్రోధ లోభ మోహాలు పోవాలంటే ఈ దృశ్యాలు ఎప్పుడూ గుర్తుంచుకోవాలి" అంది వేదాంతంగా.

"నీవు పక్కా ముస్లిం అయి ఉండీ ఈ వేదాంతం ఏమిటీ? అందునా ఇంత చిన్న వయసులో?" అడిగాడు ఆశ్చర్యంగా.

"వేదాంతానికి కులమతాలతో, వయసుతో పనేంటీ? ఫణీ, నాకు పీ.హెచ్.డీ చేసి ప్రొఫెసర్‌గా చేయాలని కోరిక. ఎందుకో నాకు ఈ వారణాసి వదిలి మరెక్కడికీ వెళ్ళాలని లేదు. కులమతాలకు అతీతంగా నిరంతరం అందరికీ నీటిని అందిస్తూ, వారి పాపాలను ప్రక్షాళన చేసే ఈ గంగా తీరం నాకు ఎంతో ఇష్టం. ఇది నీకు పిచ్చిగా ఉండవచ్చు. కానీ ఈ పిచ్చే నాకు ఇష్టం. అన్నట్లు నీవు అబ్రాడ్ వెళ్దాం అనుకుంటున్నావు కదా! ఎంత వరకు వచ్చాయి ప్రయత్నాలు?" అడిగింది.

ఫణిచంద్రకి స్పష్టంగా అర్థం అయింది ఆమెకి ప్రేమ వికారాలు లేవని. తామిద్దరికీ సరిపడదు.. అని పరోక్షంగా చెప్పటానికే ఇక్కడికి తీసుకువచ్చింది అని. ఇప్పుడు ఫణిచంద్రలో కూడా ఒక స్పష్టత వచ్చేసింది. సాంప్రదాయానికి పెద్ద పీట వేసే తమ కుటుంబంలోకి ఫాతిమాని ఆహ్వానించటం ఇద్దరికీ ఆరోగ్యకరం కాదు. ఒకవేళ ఫాతిమా నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పి ఉంటే అటూ ఇటూ చెప్పలేక నలిగిపోవాల్సి వచ్చేది.

ఆ తర్వాత ఫణిచంద్ర అమెరికా వెళ్ళాడు. చాలా రోజులు ఫాతిమా జ్ఞాపకానికి వస్తూనే ఉండేది. ఆమె గుర్తుకు వచ్చినప్పుడల్లా ఏదో అలజడిగా ఉండేది. అయితే కాలంతో పాటు ఆమె జ్ఞాపకాలు మరుగున పడిపోయాయి.

ఇన్నేళ్ల తర్వాత సెమినార్ కోసం వారణాసి అనుకోగానే, ఫాతిమాని చూడాలని మనసు ఆరాటపడసాగింది.

ఏ ఘాట్ దగ్గర చివరిసారిగా కలుసుకున్నారో అదే ఘాట్ దగ్గర మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత కలవటం చాలా యాదృచ్ఛికం.

**"ఫణీ, మెడికల్ షాపు నుంచి అటూ ఇటూ వెళ్ళకుండా ఇంటికి వచ్చేయి. ఊర్లో పరిస్థితులు బాగా లేవు" తండ్రికి జ్వరంగా ఉండటంతో మందుల కోసం బయటికి వెళుతున్న కొడుకు ఫణిచంద్రతో అన్నది అనసూయ.**

.............

"ప్రాక్టికల్ థింకింగ్ ప్రేమని పక్కకి నెట్టేసింది, అంతేగా?" ఆమె గురించి అంతా విన్న రాఘవ అన్నాడు.

సమాధానం చెప్పలేదు ఫణి. అతని ఆలోచనల నిండా ఫాతిమానే ఉంది. ఆమె పెళ్లి చేసుకుందా? చేసుకుంటే ఎవరు? ఇలా ఆలోచిస్తూనే ఉన్నాడు.

ఆ మర్నాడు ఫాతిమా చెప్పిన అడ్రసు వెతుక్కుంటూ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు ఫణి.

అతని కోసమే ఎదురు చూస్తున్నట్టు, గేటు చప్పుడు కాగానే తలుపు తీసి లోపలికి ఆహ్వానించింది. చాలా అందంగా, నీట్‌గా, నిశ్శబ్దంగా ఉంది ఇల్లు.

ఫణిని సోఫాలో కూర్చోబెట్టి ఒక ప్లేట్‌లో బిస్కెట్లు, రెండు కప్పులు టీ పట్టుకుని వచ్చింది.

"చెప్పు ఫణీ, ఏమిటి విశేషాలు? ఎలా ఉన్నావు? వాట్ ఎబౌట్ యువర్ ఫ్యామిలీ?" అడిగింది టీ ఇస్తూ.

"ఇద్దరు పిల్లలు. పెళ్లిళ్ల కూడా అయ్యాయి, బాగానే సెటిల్ అయ్యారు. మా మిసెస్ కూడా వర్కింగ్. ప్రత్యేకంగా ఏమీ లేవు. నీ కబుర్లు ఏమిటీ? మీవారు ఎక్కడా?" అడిగాడు ఫణిచంద్ర.

"నిన్ననే మా వారు, పని మీద ఢిల్లీ వెళ్ళారు. ఇక నా సంగతంటావా, అందరిలాగే నాకు కూడా పీజీ కాగానే పెళ్ళి చేసారు. అసలు అక్కడిదాకా చదివించటమే మాలో ఒక రెవల్యూషన్. నా అదృష్టం కొద్దీ అతనిది వారణాసే. నేను ఉద్యోగం చేయటం కూడా సమ్మతమైంది. నా కోరిక ప్రకారం ముందు పీహెచ్‌డీ పూర్తి చేసి తర్వాత యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరాను.

లైఫ్ ఈజ్ సో హ్యాపీ. ముగ్గురు పిల్లలు, వాళ్ళ సంసారాలు వాళ్ళు చేసుకుంటూ సుఖంగా ఉన్నారు.

నాకు, నా భర్తకి చాలా వరకు ఆలోచనలు, అభిప్రాయాలు కలుస్తాయి. ఇద్దరం మతాలకతీతంగా అన్ని సేవా కార్యక్రమాల్లో పాల్గొంటాం. నీకు తెలుసు, మొదటి నుండి నా మనస్తత్వం అందరి కంటే భిన్నంగా ఉండటం. అది నాకు ఎలా అలవడిందో నాకే తెలియదు.

ఒకరోజు ఇద్దరం గంగా తీరం వెంట నడుచుకుంటూ వస్తుంటే, ఒక శవాన్ని నిర్దాక్షిణ్యంగా గంగా నదిలో వదిలేస్తున్నారు. అది చూసి మాకు చాలా బాధేసింది. కాశీలో మరణం గురించి హిందువుల్లో ఉన్నటువంటి ఒక నమ్మకం మాకు తెలుసు. చివరి రోజులు ఇక్కడ గడపాలని, చివరి శ్వాస విడవాలని ఎంతోమంది వస్తుంటారు.

అయితే ఏ కారణాల వల్లనైతే నేమి అనాథల్లా చనిపోయిన వారిని, ఈ విధంగా గంగా నదిలో తోసేయటం అనేది అమానుషం అనిపించింది. దానివల్ల గంగా నది కలుషితం కావటమే కాకుండా చనిపోయిన ఆత్మకు ముక్తి కలగదు కదా! అనిపించింది.



"ఇద్దరు పిల్లలు. పెళ్ళిళ్ళ కూడా అయ్యాయి, బాగానే సెటిల్ అయ్యారు. మా మిసెస్ కూడా వర్కింగ్. ప్రత్యేకంగా ఏమీ లేవు. నీ కబుర్లు ఏమిటీ? మీవారు ఎక్కడా?" అడిగాడు ఫణిచంద్ర.

ఇక అప్పటినుంచి ఇదిగో, ఈ అనాథ ప్రేత సంస్కారం అనేటువంటి కార్యక్రమాన్ని చేపట్టాం" ఫాతిమా చెప్పింది చాలా ఆసక్తికరంగా విన్నాడు ఫణిచంద్ర.

"నీవు ముస్లింవి. మరి ఇటువంటి హిందూ కార్యక్రమాలు చేస్తుంటే మీ కమ్యూనిటీ నుంచి ఎటువంటి ఇబ్బంది నీకు ఎదురు కాలేదా?" అడిగాడు.

"బంధు వర్గంలోనే కాదు.. ఇక్కడ హిందువుల నుంచి కూడా అవాంతరాలు అడ్డంకులు, విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చింది. వాటిని మేం లెక్క చేయలేదు. కానీ నాకు ఒకటే బాధ అనిపిస్తుంది ఒక మంచి పని చేయటానికి ఈ కులమతాలు ఎందుకు అడ్డంకి అవుతాయో నాకు అర్థం కాదు. మానవత్వానికి మతం ఉంటుందా?" అంది ఫాతిమా.

ఫణిచంద్రకి ఫాతిమాని చూస్తుంటే చాలా అద్భుతంగా అనిపించింది. చిన్న వయస్సులోనే ఆమె మాట్లాడిన వేదాంతం మాటలు ఇప్పటికీ అతనికి గుర్తే. ఇప్పుడు మళ్లీ జాతీయ సమైక్యతకి ప్రతిరూపంగా నిలబడ్డ ఫాతిమా మీద అతనికి ఎంతో గౌరవం కలిగింది అదే మాట అన్నాడు ఫాతిమాతో.

"జాతీయ సమైక్యతకు మన దేశం ఉదాహరణ ఫణీ. నిజానికి ఈరోజు నువ్వు ప్రత్యేకంగా జాతీయత గురించి మాట్లాడాల్సిన అవసరం ఏమీ లేదు. కాశీ విశ్వనాథుడు మేల్కొనేది బిస్మిల్లా ఖాన్ షెహనాయితోనే, అయ్యప్ప నిదురించేది జేసుదాస్ పవళింపు పాట తోనే కదా!" అంది మళ్ళీ ఫాతిమా.

ఆమె విశ్లేషణకి అబ్బురపడుతూ, ఆమె వ్యక్తిత్వం మీద గౌరవం ఇనుమడించగా అప్రయత్నంగా చేతులు జోడించాడు ఫణిచంద్ర.

చేతల్లో చూపించలేని తాను, జాతీయ సమైక్యత మీద ఏకంగా సెమినార్‌లోనే మాట్లాడబోతున్నాడు. కానీ ఆమె చేతల్లో చూపిస్తున్నది. దీనినే అంటారు "ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్, గట్టి మేలు తల పెట్టవోయ్" మనసులో అనుకున్నాడు ఫణిచంద్ర.

(11వ పేజీ తరువాయి..)

## దృఢ సంకల్పంతో..



పైపైన చూస్తే సుఖంగా ఉండేందుకు ఇవన్నీ అవసరమైతే అవచ్చేమోగానీ నిజంగా మనిషిని నిలబెట్టేది, అడుగు ముందుకు వేయించేది అతని ఆత్మవిశ్వాసమే అదే ఆత్మబలం. పుట్టిన ఏడాదిన్నరకే కళ్ళు కనిపించక, చెవులు వినిపించక, శాశ్వతంగా అంధ, బధిర, మూగ అయిన హెలెన్‌కెల్లర్ మానసికంగా కుంగిపోకుండా అంగవైకల్యాన్ని జయించి 88 సంవత్సరాలు జీవించి ఎంతో ఉన్నత స్థితికి చేరడంలోని రహస్యం తెలుస్తున్నది. 43 యేళ్ళ వయస్సులో అంధత్వం రావడంతో లోకమంతా అంధకారమైనా తన మనోలోకంలో వెలుగుని నింపుకొని ప్యారడైజ్ లాస్ట్ లాంటి మహా కావ్యాలతో ప్రఖ్యాత కవిగా నిలిచిన జాన్ మిల్టన్ గొప్పతనాన్ని మనం గ్రహించవచ్చు. అంధుడే అయినా కృష్ణుడిపై పాటలు పాడుతూ సాగిన వాగ్గేయకారుడు సూర్‌దాస్ ఆత్మస్థైర్యం స్ఫూర్తిదాయకం. చిత్రమైన వ్యాధితో రెండు కాళ్లు చచ్చుబడిపోయినా, తన అంగవైకల్యానికి కుంగిపోకుండా రాజకీయాల్లోకి ప్రవేశించి అమెరికా అధ్యక్షుడిగా ఎదిగిన ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ సంకల్పబలాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

పై విషయాలను తరచి చూస్తే అంగవైకల్యం జీవితంలో ఎదగడానికి ఒక అవరోధం కానేకాదు. ఎటువంటి అంగవైకల్యాన్నయినా మనోనిబ్బరంతో జయించవచ్చు. వైకల్యం అంటూ ఉంటే అది మనస్సుకే తప్ప మరిదేనికీ కాదని అవగతమవుతున్నది. సానుకూలమైన ఆలోచనలకు, నిర్మాణాత్మక భావాలకు ప్రాధాన్యమిచ్చినప్పుడే జీవితంలో విజయ పతాకాన్ని ఎగురవెయ్యగలరు. ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు.


# తల్లినొకసారి తలచుమాంధ్ర!

జయసూర్య

**"నన్నయ, తిక్కన్న నామంబులను త్రోసి**
**బెంగాలి బాబుల పేరులేల?**
**నవ్యాంధ్ర సాహిత్య నవనీతమును రోసి**
**హిందీ కవిత్వంపు టెంగిలేల?**
**అఖిల ప్రజ్ఞాన్వితులాంధ్ర రత్నములుండ**
**గుజరాతు దేవుళ్ల భజనలేల?**
**పొంగిపోదువు పొరుగింటి పుల్లకూర**
**అంధకారము వీడి శుద్ధాంధ్రమెరిగి**
**తల్లినొకసారి మనసార తలచుమాంధ్ర"**

క్రొవ్విడి వేంకటరత్నశర్మ, ఆంధ్ర స్మృతి (తెలుగు వీధులు) అనే పద్యకావ్యంలో నాటి ప్రబోధం యిది. ఒకప్పుడు నిద్రాణమైన జాతిని ప్రబోధించటానికి యిటువంటి రచనలు ఆవశ్యకంగా వుండేవి. ఆంధ్ర ప్రతిభను పునరుద్ధరించటానికి, నాడు ఆంధ్ర రాష్ట్ర సాధనకు ముందు ఆంధ్రోద్యమ బీజం మహా వృక్షంగా సతతం దోహదం చేయడానికి నాటి కవిపండితులు ఆంధ్ర రాష్ట్ర అవతరణ, ఆంధ్ర మహాభ్యుదయ పరంపరాభివృద్ధికి యిటువంటి ప్రబోధక గ్రంథాలు రచించారు.

సుప్రసిద్ధ పాశ్చాత్య చరిత్రకారుడు జి.జొవే, దుబ్రే యుల్, ఒక సందర్భంలో "ఆంధ్రజాతి మహత్తరమైనది. ఇండో చైనా, జావా, సుమిత్రాలను నాగరికం చేసిన నౌకలు, ఆంధ్ర తీరం నుండి వెళ్లినవే. గత చరిత్రలో ఇంత మహత్తరమైన దేశం, భావి చరిత్రలో కూడా మహత్తరమైనది కాక తప్పదు" అన్నాడు.



1816లో ఎ.డి.క్యాంబెల్ "ఎ గ్రామర్ టు తెలుగు లాంగ్వేజ్" అన్న పుస్తకం రాసాడు. దక్షిణ భారత భాషలు నేర్చుకొన్న పాశ్చాత్య పండితుడు, డచ్చి దేశస్తుడైన రాస్మిస్ క్రిష్టియన్ రాస్ (1787-1832) దక్షిణ భారత భాషలకు, సంస్కృతానికి జన్య జనక సంబంధం లేదని చెప్పాడు. దక్షిణ భారత భాషలు, యింకా 12 ఆదివాసుల భాషలు ఒక్క కుటుంబానికి చెందినవనీ, వాటి నిర్మాణం ఒకే తీరుగా వున్నదని సోదాహరణంగా నిరూపితమైంది. అప్పటి నుంచి దక్షిణ భారత భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం యిత్యాదులకు 'ద్రావిడ భాషలు' స్థిరడింది.

ద్రావిడ భాషలు సంస్కృతాన్ని ప్రభావితం చేసాయని, అదే విధంగా సంస్కృతం వల్ల ప్రభావితం అయ్యాయని ప్రాచీన కాలంలో "తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును" అనే అభిప్రాయంపై, దక్షిణ భారత భాషలు నేర్చుకొన్న పాశ్చాత్య పండితులు ఫ్రాన్సిస్ ఎల్లిస్, బిషప్ రాబర్ట్ కాల్డ్వెల్ వంటి భాషా శాస్త్రజ్ఞులు గుర్తించారు. ద్రావిడ భాష ఒక్క దక్షిణ భారతంలోనే కాక, ప్రాచీన అఖండ భారతావనిలో ప్రజల భాషగా విలసిల్లిన భాషా చరిత్ర వుంది. తెలుగు భాష ఉనికి క్రీ.పూ. 3వ శతాబ్దం నాటిదని తెలియచేసే ప్రాచీన శాసనాలు ఎన్నో తెలంగాణ ప్రాంతంలో వెలుగు చూసాయి. తెలంగాణలో మౌఖికంగా కీర్తన సాహిత్యం వెల్లివిరిసింది. సంస్కృతంలో అష్టాదశాది పురాణాలు, జైనుల పురాణాలు, వీరశైవుల పురాణాలున్నట్టే తెలంగాణ జానపదులు కూడా కుల పురాణాలు మౌఖికంగా జనశ్రుతిగా నేటికీ నిలిచి వున్నాయి. ఆధునిక కాలంలో సురవరం ప్రతాపరెడ్డి, బిరుదురాజు రామరాజు, జయధీర్ తిరుమలరావు, నసుమాస స్వామి వంటి ఎందరో పరిశోధనల ఫలితంగా తెలంగాణ జానపద తెలుగు సాహిత్యం విశ్వవిద్యాలయం పీఠాలను ఎక్కింది. ఆంధ్ర సారస్వత పరిషత్తు పక్షాన డా॥ ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర పరిశోధనాత్మకంగా, శాస్త్రీయ దృక్పథంతో ప్రామాణిక రచన వెలువరించారు. ఆ గ్రంథం తెలంగాణ సాహితీ వైలక్షణ్యానికి మణిదర్పణంగా భాసిస్తున్నదని డా॥ సి.నారాయణ రెడ్డి ప్రశంసించారు.

ప్రస్తుతం, కాలక్రమానుగతంగా మాతృభాష తెలుగు రాజకీయ పాలనా ప్రాధాన్యత దృష్ట్యా రెండు రాష్ట్రాలలో విలసిల్లుతోంది. ఈ వ్యాసం ఆరంభంలో ప్రబోధ పద్యం నాటి రోజుల స్థితిగతులు విభిన్నం అయినా, కరీంనగర్ జిల్లా పెద్దపల్లి (నిజాం కాలంనాటి జాగీర్) నుండి ప్రచురితమైన ఆంధ్ర స్మృతి ఖండ కావ్యంలో క్రొవ్విడి వేంకటరత్న శర్మ 'తెలుగుతల్లి'ని స్తుతిస్తూ యిలా అంటారు.

**తమిళ మాగాణంబు దండెత్తి పండించె**
**రాచపాళెపు నీదు రాచకొలము**
**కర్ణాటక వాణికి నేర్పె నీ ఛందంబు**
**నాగవర్మాభిఖ్య వేగిబుధుడు**
**అంగ, వంగ, కళింగ, యుత్తరాహలకొజ్జ**
**బంతుల నేర్పిన భాగ్యవతివి**
**ప్రథిత మహారాష్ట్ర రాజ శివాజీకి**
**రాజ్యతంత్రమిడిన రాణివీవు**
**దర్శన శుభావహాకార ధన్యవీవు**
**విందులొనగూర్చి వజ్రాల నందించినావు**
**తెలుగు మా తల్లి నేడిట్లు దీనవైతె**
**కాలగతుల నెవ్వారలు గడపగలరు?**

అంటారు.

ఈ ఖండకావ్యం 1946 డిసెంబరులో ప్రచురింపబడింది. ప్రస్తుత పాలనా వ్యవస్థకు అనుగుణంగా, భాషల పేరిట రాష్ట్రాలున్నాయి. భాషాభిమానాన్ని "ఏ జాతియు తన నాగరికత, విజ్ఞానం విప్లవాలు ఎన్ని వచ్చినా సంరక్షించి భద్రపరచుకొనుట సద్వివేకం. అదే నా సందేశం" అంటారు రచయిత.

**"దీనారటంకాల తీర్థంబులాడించె**
**కొలువుకూటములందు తెలుగు రాజు'**
**రోము, చైనా, జావసీమ రేవుల సల్పె**
**ధీరవ్యాపారముల్ తెలుగు బేరి**
**ప్రకృతి శోభవెలార్ప పండించె పంట**
**బంగారంబు లీ తెలింగాణ కాపు**
**కలిమి బ్రతికి చెడినవాడు తెలుగువాడు.**
**"ఆరాధింపుము 'తెలుగుతల్లి' ఎపుడు**
**ఉద్యద్భక్తి పెంపారగా"**

అంటూ ఉద్బోధిస్తారు. ●

# వయసు అడ్డంకి కాదు..

**ఫిజిక్స్ అరుణ్‌కుమార్**

**ఏదైనా సాధించాలనుకుంటే దానికి మన వయసు అడ్డు రాదంటారు. మనసులో ఆలోచనల అలికిడి యువతరపు డోలనాలు చేస్తుంటే వృద్ధాప్యం ఎక్కడుంటుంది..! వయసు ఓ సంఖ్య మాత్రమే.**

51 ఏళ్ల వ్యక్తి క్రికెట్ బ్యాట్ పట్టుకొని స్టేడియంలో దిగుతుంటే ఎప్పటిలాగానే దశాబ్దాలుగా స్టేడియం మొత్తం సచిన్..! సచిన్..! అంటూ మారుమోగింది. ఆయన కొట్టిన షాట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నేటితరం ఆయన ఆటకు ఫిదా అవుతూనే సచిన్‌లోని అంకిత భావానికి సెల్యూట్ చేస్తున్నారు.

2025 International Masters League T20 సందర్భంగా మళ్ళీ యావత్ ప్రపంచం మాస్టర్ బ్లాస్టర్ ఆటను ఎంజాయ్ చేస్తున్నారు. తను మాత్రం ఇప్పుడే ఆరంగేట్రం చేసిన ఓ కుర్రాడిలా, ఏమీ తెలియనట్లు, చిరునవ్వులు చిందిస్తూ, తనదైన స్ట్రెయిట్ డ్రైవ్‌లతో అలరిస్తున్నారు.

"Life is a problem,Solve it.

Life is a challenge, accept it.

Life is a game,play it."

మనకు నిద్రలో ఎన్నో కలలు వస్తుంటాయి. మెలకువ రాగానే అన్నీ మాయమవుతుంటాయి. కానీ కొన్ని కలలు మనలో నిక్షిప్తమై మనల్ని అనుక్షణం వెంటాడుతుంటాయి. మనకు నిద్ర లేకుండా చేస్తాయి. అవి నిజం చేసుకోవాలనే మన ధృడ సంకల్పపు జీవన ప్రవాహంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూడాల్సి వస్తుంది. ఆ కల నిజమయ్యాక మాత్రం కొన్ని తరాలకు స్ఫూర్తి తార అవుతుంది. నిన్ను చరిత్రలో చిరస్థాయిగా నిలుపుతుంది.

చిన్నప్పుడు టివిలో గవాస్కర్, కపిల్ దేవ్ వంటి దిగ్గజాల ఆటను చూస్తూ భవిష్యత్తులో తన దేశాన్ని విశ్వ విజేతగా చూడాలనుకున్నాడు ఓ పిల్లాడు. వరల్డ్ కప్ తాను పట్టుకున్నట్లు కలలు కనేవాడు. ఆ కల నిజం కావడం కోసం అలుపెరగని 24 సంవత్సరాలు సుదీర్ఘ ప్రయాణం కొనసాగించాడు. ఎన్నో అపజయాలను, అవమానాల భారాలను తన కన్నీటి నీడలో కనపడకుండా భరిస్తూనే ఎదిగాడు. ఓ సందర్భంలో తన తండ్రి చనిపోయిన బాధను సైతం దిగమింగి తన సెంచరీతో మన దేశాన్ని గెలిపించాడు.



అంతర్జాతీయ క్రికెట్‌లో వంద సెంచరీలు సాధించడమే కాకుండా మనందరికీ వన్డే క్రికెట్‌లో వరల్డ్ కప్ అందించాడు. క్రికెట్ పిచ్‌పై పరుగుల వరద పారించాడు. రెండు దశాబ్దాలకు పైగా అంతర్జాతీయంగా క్రికెట్ స్టేడియాలు సచిన్ నామస్మరణతో దద్ధరిల్లిపోయాయి.

సచిన్ ఔటైతే టివిలన్నీ మూగబోయాయి. ఓ స్థాయిలో సచిన్ ఆట కోసమే యావత్ ప్రపంచం క్రికెట్ చూసింది. సచిన్ ఆటకు వీడ్కోలు పలికినప్పుడు ఐక్యరాజ్యసమితి మొదలు ప్రపంచ ప్రముఖులు సైతం స్పందించారు.

బ్రాడ్‌మన్ వంటి ఆటగాడు సైతం సచిన్ ఆటకు ముగ్ధులయ్యారు. నేటి అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన క్రికెట్ ఆటగాళ్లకు సచినే ఆరాధ్యుడు. అందుకే ఆయన్ని క్రికెట్ దేవుడు అంటారు. మన దేశ ప్రభుత్వం ఆయనని 'భారతరత్న'తో సత్కరించింది.

సచిన్ టెండూల్కర్ తాను ఆడిన ఫస్ట్ వన్డే మ్యాచ్‌లో తన పరుగుల ఖాతా ఆరంభించకుండానే ఔటయ్యాడు. కానీ అక్కడే ఆగిపోలేదు. నిత్యం తనలోని ఆట నైపుణ్యపు మెరుగుదల కోసం దశాబ్దాల యుద్ధమే చేశాడు మైదానంలో. బ్యాట్, బంతితో..! అనుకున్నది సాధించి "ప్లేయింగ్ ఇట్ మై వే" అంటూ తన ఆత్మకథలో ఎన్నో తన జీవిత అనుభవాలకు అక్షర రూపం ఇచ్చారు.

నాపై ఎన్నో రకాల రాళ్లను విసిరారు. నేను అవి నా జీవితానికి మైలురాళ్ళుగా మార్చుకున్నాను అంటారు సచిన్. ఈ మధ్యే బిసిసిఐ సచిన్‌ను జీవితకాల సాఫల్య పురస్కారంతో కూడా సత్కరించింది.

Then Don Bradman...!

Now Virat Kohli....!

Forever Sachin Tendulkar....!!

అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ, కేరింతలతో సచిన్ ఆటను స్వాగతిస్తోంది నేటి నవతరం. మనమంతా జీవన సమస్యల పరిష్కారాల సాధనలో ఎక్కడా ఆగకుండా ఆశావాదంతో, ఆత్మవిశ్వాసంతో ప్రయత్నాల ప్రయాణం కొనసాగిస్తే మనలో వున్న సచిన్ బయటికొస్తాడు.

ఎదగాలనే ప్రయత్నం ప్రతి జీవి లక్షణం..! సమస్యను సాధిస్తే ప్రపంచానికి నువ్వు నడిచిన దారే భవిష్యత్తు తరాలకు రహదారి అవుతుంది. నీ గురించి కొత్త చరిత్ర రాస్తుంది..!

ఆగకు...అలసిపోకు..!

చావకు...నీ లక్ష్యాన్ని చంపకు..!

నీ జీవితం చెప్పే ఇలాంటి రాతలే భవిష్యత్తు తరాలకు ప్రేరణ తారలు అవుతాయి.

- అప్పు తీసుకున్నప్పుడు హ్యాపీగా ఉంటుంది. తీర్చేటప్పుడే నొప్పిగా ఉంటుంది చాలామందికి.. అలాంటప్పుడు అప్పు తీసుకోవడం ఎందుకు? ఆలోచించండి.

- మంచి లక్ష్యానికి సాక్ష్యంగా ఉండాలనుకో. ఆ దిశగా కృషి చెయ్. ప్రయత్నం చెయ్యి.

# ఆ స్థలంలో గృహం నిర్మించవచ్చా?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

సెల్స్: 9885446501/9885449458






**బి.శ్రీనివాస్, అనంతపురం**

ప్రశ్న: పటంలో చూపించిన విధంగా 33x50 అడుగుల స్థలం దక్షిణం రోడ్డు, తూర్పు రోడ్డు వున్నది. అలాగే తూర్పు ఆగ్నేయం రోడ్డు వున్నది. ప్రస్తుతం నేను యిల్లు కట్టుకోవటానికి ఏమయినా అభ్యంతరమున్నదా? లేదా? వుంటే ఎలాంటి సమస్యలు లేకుండా సంపూర్ణ వాస్తుతో కూడిన విధంగా యింటి ప్లాను ఇవ్వగలరు.

జవాబు: మీ స్థలానికి తూర్పు ఆగ్నేయం వీధిపోటు స్వల్పంగా తగులుతుననది. తూర్పు ఆగ్నేయ వీధిపోటు వలన చోరాగ్ని భయాలు, మనస్తాపం కలిగే అవకాశం ఉంది. అందువల్ల వీధిపోటు తగులుతున్న మేర కంటే మరికొంచెం(దక్షిణ) స్థలాన్ని వీధిలోకి వదిలేసి ప్రహరీగోడ కట్టుకోవలసి ఉంటుంది.

ఆ స్థలంలో మీరు వాస్తు ప్రకారం చక్కగా గృహ నిర్మాణం గావించుకొని నివసించవచ్చు. అయితే మిగతా వాస్తు నియమాలన్నీ మామూలుగానే పాటించవలసి ఉంటుంది. మీకు యింటి ప్లాను పత్రికా ముఖంగా యివ్వటం కుదరదు. వ్యక్తిగతంగా సంప్రదించి నూతన గృహాల నిర్మాణాలకి ప్లాను పొందవచ్చు. క్షేత్రం(స్థలం) బాగుంటేనే ప్లాన్స్ యిస్తుంటాం. స్థలం బాగా లేకపోతే యిల్లు అక్కడ కట్టొద్దని చెప్తాం. క్షేత్రమే వాస్తు ప్రకారం బాగోలేనప్పుడు అక్కడ గృహ నిర్మాణం గావించుకుని వుంటే ఫలితాలు బాగుండవు. కనుక ప్లాన్స్ యివ్వబడవు.

## ఇబ్బందులను అధిగమించేదెలా?

**పి.మమత, వరంగల్**

ప్రశ్న: ఇంట్లో అనారోగ్య సమస్యలు, గొడవలు, ఎక్కువ అవుతున్నాయి. పెద్ద చదువులు చదివిన తమ్ముడు ఉద్యోగం కోసం ఎదురు చూడటం, ఆర్థిక ఇబ్బందులు మొదలయిన సమస్యలున్నాయి. వీటన్నిటికీ మీరే దారి చూపగలరని నమ్మి ఈ ఉత్తరం రాస్తున్నాను. తమ్ముడి పుట్టిన తేదీ లేదు. కానీ 1987 సంవత్సరంలో శ్రీరామ నవమి తెల్లవారి దశమిరోజు మధ్యాహ్నం పుట్టినట్టు తెలుసు. ఆ తేదీని కూడా దయచేసి చెప్పండి.

జవాబు: మీరు చెప్పిన వివరాల ప్రకారం మీ పుట్టిన తేది(శ్రీరామ నవమి మార్చి 7) మార్చి 8,1987 దశమి, నక్షత్రం: పుష్యమి 4వ పాదం లేదా ఆశ్లేషా 1వ పాదం కానీ కావచ్చు. ప్రతి సంవత్సరం నవగ్రహ ప్రదక్షిణలు, శనిదానం, జపం, అభిషేకం చేయించటం వలన మంచి ఫలితాలు పొందవచ్చు.

## ఎవరి పేరుతో రిజిస్టర్ చేయాలి?

**కె.పద్మావతి, హైదరాబాద్**

ప్రశ్న: నా పేరు మీద పడమర ముఖంతో ఖాళీ స్థలం వున్నది. అది మా అమ్మాయికి ఇచ్చాం. కానీ యింకా గిఫ్ట్ డీడ్ రాయలేదు. ఆ స్థలానికి దక్షిణం వైపున మరో ఖాళీ స్థలం వున్నది. అది తప్పనిసరి పరిస్థితులలో తీసుకోవలసి వచ్చింది. అది కూడా మా అమ్మాయికే ఇవ్వవలసి వున్నది. వాస్తు ప్రకారం ఆ దక్షిణం వైపు ఖాళీ స్థలం నా పేరున రిజిస్టర్ చేయకూడదు కదా! మరి మా అమ్మాయి పేరుగానీ, మా వారి పేరు మీదగానీ రిజిస్టర్ చేయవచ్చా? మా వారి పేరు మీద రిజిస్టర్ చేసినా త్వరలో అది మా అమ్మాయికే యివ్వవలసి వున్నది.

జవాబు: ఒక గృహానికి ఆనుకొని దక్షిణం, పడమటి దిక్కుల్లో ఖాళీ స్థలాన్ని కొని కలుపుకోకూడదు. కానీ ఖాళీ స్థలానికి దక్షిణ, పడమటి దిక్కుల్లో ఆనుకొని వున్న ఖాళీ స్థలాన్ని కొని కలుపుకోవచ్చు. ఆ స్థలం కొని కలుపుకునేటప్పుడు మిగతా వాస్తు నియమాలన్నీ సమానంగా సరిపోయినవో లేదో గమనించి జాగ్రత్త పడాల్సి ఉంటుంది.

మరో ముఖ్యమైన విషయం: ఇల్లు గానీ, స్థలంగానీ ఎవరి పేరిట రిజిస్టర్ అయితే వారికే ఫలాఫలాలు ఉంటాయనుకోవటం సరైంది కాదు. ఒక స్థలం లేదా భవనం వాస్తు ప్రకారం బాగోలేకపోతే ఆ చెడు ఫలితం తమకు రాకూడదన్న ఉద్దేశంతో దాన్ని వేరే ఎవరి పేరు మీదో రిజిస్టర్ చేయిస్తుంటారు. కానీ ఆ స్థలం లేదా భవనం పైన వచ్చే ఆదాయం మాత్రం స్వంతంగానే అనుభవిస్తుంటారు. ఇది సరయిన అవగాహన కాదు. ఎవరయితే ధర చెల్లించి ఒక గృహాన్ని కొంటారో అతడే స్వంతదారవుతాడు. ఎవరయితే ఒక గృహం పైన వచ్చే ఆదాయాన్ని అనుభవిస్తూ ఉంటారో, వారే ఆ గృహ వాస్తు ఫలాఫలాలను అనుభవించగలవారవుతారు. ఈ స్థలం బాగుంటే మీరు కొని మీ అమ్మాయికి కానుకగా యివ్వవచ్చు.

---

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: **సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్-3**

**వాస్తువార్త**

పూర్తి పేరు : ........................................

పుట్టిన తేది : ........................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............

చిరునామా:...........................................

# వకుళాదేవి దర్శనం సర్వపాపహరణం

యం.రహంతుల్లా

తిరుపతి జిల్లా ఆధ్యాత్మిక చింతనకు నిలయం. ఓ వైపు ఆధ్యాత్మిక వాతావరణం, మరోవైపు పర్యాటక కళాఖండంగా అభివృద్ధి చెందుతోంది. ఒకవైపు వైష్ణవ ఆలయాలు, మరోవైపు శైవాలయాలతో విరాజిల్లుతోంది. ఆలయాల అభివృద్ధికి టిటిడి, దేవాదాయ శాఖ ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరుస్తున్నారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆలయాలను పురావస్తుశాఖ భద్రపరుస్తూ వాటి రూపురేఖలను దిద్దుతున్నారు.

వకుళాదేవి ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుమలకొండపై వెలసి ఉన్న వెంకటేశ్వరుని పెంపుడుతల్లి. విష్ణువు రూపం. తిరుమల పురాణం ప్రకారం వకుళాదేవి పురాణం ద్వాపర యుగానికి చెందినది. ఇక్కడ వెలసిన అమ్మవారు పద్మాసనం వేసుకుని ఎడమ చేతితో అక్షయపాత్రను పెట్టుకుని ఉండడం గమనించదగ్గ విషయం. పురాణంలో విష్ణువు అవతారమైన కృష్ణుడి పెంపుడుతల్లి యశోద, లక్ష్మి అవతారమైన రుక్మిణితో అతని వివాహాన్ని తాను చూడలేదని అయనకు ఫిర్యాదు చేసినట్లు స్థానికంగా ఉన్న ఆధారాలను బట్టి తెలుస్తోంది.

కలియుగంలో లక్ష్మి రూపంలో ఉన్న వివాహాన్ని చూసే అవకాశం ఆమెకు లభిస్తుందని శ్రీకృష్ణుడు బదులిస్తాడు. కలియుగంలో విష్ణువు వెంకటేశ్వరుడి రూపంలో అవతరించగా యశోద వెంకటేశ్వరుడి పెంపుడుతల్లి అయిన వకుళాదేవిగా పునర్జన్మ పొందింది. దేవదేవుడు వాగ్దానం చేసినట్లుగా ఆమె తన పెంపుడు కొడుకు వివాహాన్ని ఆకాశరాజు, లక్ష్మి స్వరూపమైన ధరణి రాణిల పెంపుడు కుమార్తె పద్మావతితో నిశ్చయం చేసింది.

## వకుళాదేవి ఆలయం

వకుళాదేవి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి 5 కి.మీ దూరంలో చిత్తూరు జాతీయ రహదరి పక్కన ఓ రాతిగుట్టపై అమ్మవారి ఆలయం వెలసింది. ఈ ఆలయాన్ని ఐదు వేల సంవత్సరాల క్రితం తిరుపతి 3 వేల బిసిఈలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. మూడు వందల సంవత్సరాల క్రితం 17వ శతాబ్దం సిఈలో తిరుపతిలోని పేరూరు చుట్టూ ఉన్న పేరూరు బండకొండపై శాసనం చేయబడింది.



క్రీ.శ.2011 నుంచి 2022 వరకు ఆలయాన్ని పునరుద్ధరించబడింది. ఈ ఆలయానికి యాభై ఎకరాల భూమి మాన్యంగా ఏర్పాటు చేశారు. ఈ ఆలయం వకుళాదేవి ముఖం ఏడు కొండలను తిలకించే విధంగా నిర్మించబడింది. ఏడు కొండలపై ఆమె పెంపుడు కుమారుడు కలియగ దైవం వెంకటేశ్వరుడు నివసిస్తున్నాడు.

తిరుమలలో వేంకటేశ్వరుని ముందు వకుళాదేవికి నైవేద్యం (పవిత్రమైన ఆహారం) సమర్పిస్తారు. స్వాతంత్ర్యం తర్వాత ఈ ఆలయం నిర్లక్ష్యం చేయడంతో అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. దేశంలోని వాడవాడల్లో ఉన్న దేవాలయాల పునరుద్ధరణ కోసం టిటిడి లక్షలాది కోట్లు రూపాయలు ఖర్చు చేస్తూ వెంకటేశ్వరుని పెంపుడు తల్లి వెలసిన ఆలయాన్ని టిటిడి విస్మరించడం గమనించదగ్గ విషయం. దాంతో భక్తుల భాగస్వామ్యంతో రూపురేఖలను దిద్దుకుంది.

## కొండపైన వెలసిన వకుళమాతాదేవి

ఆలయం ఉన్న కొండను ధ్వంసం చేసి ఆ రాతిని నిర్మాణ పరిశ్రమలో ఉపయోగించేందుకు అక్రమంగా తవ్వుతున్నారు. శతాబ్దాల నాటి ఆలయాన్ని సంరక్షించాల్సిన పురావస్తు శాఖ పట్టించుకోకపోవడంతో కొండ కరిగింది.

ఇటీవల అమ్మవారికి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి భావితరాలకు అందించారు. తిరుపతి, విజయవాడ, నెల్లూరు ప్రాంతాల నుంచి బెంగళూరు వైపు వెళ్ళే ప్రతిఒక్కరు కొండపై వెలసిన వకుళమాత ఆలయాన్ని సందర్శించుకోవాలనే విధంగా నిర్మాణం చేపట్టారు. అమ్మవారి చరిత్రను తెలుసుకున విధంగా ఆలయాన్ని రూపుదిద్దారు.

## ఆలయం పునరుద్ధణ

తిరుమల తిరుపతి దేవస్థానం వకుళ మాత ఆలయాన్ని పునరుద్ధరించడానికి రూ.2 కోట్లతో ప్రణాళికను రూపొందించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ఆధ్యాత్మికత వెల్లివిరిసేటట్లు తీర్చిదిద్దారు.



కొండపై భద్రతకు కంచె ఏర్పాటు చేశారు.

### కులోత్తుంగా చోళ-3 పేరూరు శాసనం

ఆలయానికి సంబంధించి కులోత్తుంగ చోళుడు శాసనాన్ని ఏర్పాటు చేశాడు. అంటే ఈ ఆలయ ప్రాముఖ్యత భావితరాలకు అందించారు.

ఈ శాసనం పేరూరులోని వకుళమాత ఆలయ గోపురానికి ముందు రాతిపై చెక్కబడి ఉంది. ఈ శాసనం తమిళ భాషలో ఉంది. పులియూర్ కొట్టమకు చెందిన ఒక వ్యక్తి జయగొండ చోళమండలం, తిరువేంగడ కొట్టము, కుడపూర్‌నాలులోని తలైయార్ పేరూర్‌లోని అంచాన విణ్ణకర్ ఆలయంలో అంచాదవిణ్ణ (కర)ప్పెరుమాల్ వారి దేవేరి (పిరాట్టియార్) ప్రతిష్ట చేసినట్లు ఈ శాసనాల ద్వారా తెలుస్తోంది.

### పునరుద్ధరణ, పునర్నిర్మాణం

తిరుమల తిరుపతి దేవస్థానం 2011 జనవరి 1న వకుళాదేవి ఆలయంలో పునరుద్దరణ ప్రక్రియను ప్రారంభించి 11 సంవత్సరాలు దానిపై కొనసాగింది. వకుళాదేవి ఆలయం 2022లో పూర్తయ్యింది. 2022 జూలై 23న ప్రారంభించారు.

### తిరుమల గిరుల్లో వకుళమాత దేవాలయాలు

తిరుమల గిరుల్లో రెండు వకుళమాతా దేవాలయాలు ఉన్నాయి. మొదటిది తిరుపతిలోని కపిలతీర్థం వద్ద వెలసి ఉన్న మాలాడిగుండం వద్ద ఉండగా,



రెండోది శ్రీవారి ప్రధాన ఆలయంలో విమాన ప్రదక్షిణ మార్గంలో ఆగ్నేయ దిశలో ఉన్న పోటు (వంటగది)లో ఉంది. పోటులో ఉన్న వకుళాదేవి దగ్గరుండి తన కుమారుడు వేంకటేశ్వరునికి కావాల్సిన తినుబండారాలను శుచిగా, శుభ్రంగా వండిస్తుందంటారు.

వకుళమాతే బంగారు తులసీపత్ర హారం(వకుళ మాల)గా మారి శ్రీవారి మెడలో చేరిందని ఐతిహ్యం. ఈ ఆలయాన్ని దర్శించి అమ్మవారిని కోర్కెలు కోరితే తప్పనిసరిగా తీరుతాయని భక్తుల నమ్మకం. ■

---




### నీళ్లంటే భయం!

"నాకు నీళ్లంటే చచ్చేంత భయం. అందుకే ఈత నేర్చుకోలేదు" అన్నాడు ప్రకాష్ స్నేహితుడు సురేష్‌తో.

"నాక్కూడా నీళ్లంటే చాలా భయం. అందుకే నేను స్నానయం చేయటం మానేసాను" జవాబిచ్చాడు సురేష్.

అవాక్కై ముక్కు మూసుకున్నాడు ప్రకాష్.

### కూర్చుని తింటే!

"పంక్తిలో అందరూ కూర్చుని తింటుంటే అతనొక్కడు నిలుచుని తింటున్నాడు. ఎందుకని?" అడిగాడు ఒకతన్ని చూపించి సుబ్బారావు.

"కూర్చుని తింటే కొండలైనా కరిగిపోతాయని అతనికి భయమట" జవాబిచ్చాడు అప్పారావు.

### భరించటానికి..

"మా ఆవిడ ఆడది కాదురా, ఆదిశక్తి" అన్నాడు స్నేహితుడితో కార్తిక్.

"అవునా? అయితే రోజూ ఎందుకు తాగుతున్నావు?"

"ఆ శక్తిని భరించటానికి" అన్నాడు మొదటివాడు.

– టి.సదాశివరెడ్డి, పెరుమాళ్లపల్లి

టీచర్: "పండూ! నీవు ఎప్పుడూ పరుగు పందెంలో పాల్గొనలేదుగా! మొదటిసారే ఫస్ట్ ఎలా వచ్చావు?" అడిగింది.

"నా వెంట వీధికుక్కలు పరుగెత్తుకొస్తున్నట్టు ఊహించుకున్నాను టీచర్" ఠక్కున చెప్పాడు.

### జాగ్రత్త!

దొంగ: "నిన్న దొంగతనం చేసిన నగలు రేపు మార్చుకొస్తాను, జాగ్రత్తగా బీరువాలో పెట్టు" అన్నాడు భార్యతో.

భార్య: "ఈ రోజుల్లో ఎవరినీ నమ్మలేమండి, నగలు మార్చేటప్పుడు జాగ్రత్తగా ఉండండి".

### అందరిని చూస్తుదని..

భర్త: "డాక్టర్‌గారూ! మా ఆవిడకి అనుమానం ఎక్కువ. ట్రీట్‌మెంట్ ఇస్తారా?" అన్నాడు.



డాక్టర్: "మీ ఆవిడను తీసుకువచ్చారా?" అడిగాడు డాక్టర్.

శ్రీనివాస్: "వచ్చే దారిలో తను అందరినీ చూస్తుందేమోనని నా అనుమానం".

### తాకట్టు పెడితే..

కేశవరావు: "మొన్న అమ్మాయిని చూడడానికి వచ్చినవాళ్లు ఏమన్నారు?"

రామారావు: "అమ్మాయి నచ్చింది. బంగారంలా చూసుకుంటాం" అన్నారు.

కేశవరావు: "అదృష్టవంతుడివి. అమ్మాయి ఒప్పుకుందా?"

రామారావు: "ఒప్పుకోలేదు. డబ్బు కావాలన్నప్పుడు తాకట్టు పెడతాడేమో నాన్నా" అంది.

– ఈ.ఎస్.మాధవన్


### సరదా రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.

*sunmagvaartha@gmail.com*



# జీవకళ ఉట్టిపడే కొండపల్లి బొమ్మలు

షేక్ అబ్దుల్ హకీం జాని

కొండపల్లి కొయబొమ్మలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందాయి. కొండపల్లి బొమ్మలకు మంచి పేరుంది. శ్రీకృష్ణదేవరాయలుతో పాటు అనేకమంది రాజుల కాలంలో రాజవైభవంతో కొండపల్లి బొమ్మల కళ విరాజిల్లింది. ఎందరో రాజులు, జమీందారులు ఇక్కడి కళాకారులను ఆదరించారు. ఇప్పుడు యంత్రాలపై తయారయ్యే చైనా బొమ్మలతో పాటు, అనేక బొమ్మలు మార్కెట్లో అందుబాటులోకి రావడంతో కొండపల్లి బొమ్మలకు కొంతమేరకు ఆదరణ తగ్గింది. అయినప్పటికీ ఈ బొమ్మల విలువ మాత్రం ప్రజల గుండెల్లో పదిలంగా ఉంది.

## కొండపల్లి బొమ్మల చరిత్ర

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలోని ఇబ్రహీంపట్నం సమీపంలోని కొండపల్లి ప్రాంతంలో కొండపల్లి బొమ్మల తయారీ జరుగుతుంది. కొండపల్లి విజయవాడ సమీపంలోని ఒక చిన్న గ్రామం. ఇక్కడ వందల మంది నిత్యం బొమ్మల తయారీ, అమ్మకాలపై ఆధారపడి జీవిస్తున్నాయి. కొండపల్లి బొమ్మలకు 400 యేళ్ల పైబడి చరిత్ర ఉంది. చరిత్ర ఆధారాలను అనుసరించి 16న శతాబ్దంలో కొంతమంది రాజస్థానీ కళాకారులు ఇక్కడ స్థిరపడి ఈ బొమ్మలను తయారు చేయడం ప్రారంభించారని తెలుస్తోంది. కొండపల్లి కళాకారులు అర్య క్షత్రియ సమాజానికి చెందినవారు. వీరు తరతరాలుగా బొమ్మలను తయారు చేస్తున్నారు. కొండపల్లి బొమ్మలు కొండపల్లి చుట్టుపక్కల అడవులలో దొరికే తెల్లపొనికి అనే తేలికపాటి మెత్తని చెక్క నుండి తయారవుతాయి. వృక్షశాస్త్ర పరంగా జియుటియా రోటెరి ఫ్రోమిస్ అని పిలుస్తారు. ఈ చెక్క చాలా మృదువుగా, తేలికగా ఉండి, బొమ్మలు తయారుచేయడానికి అనువుగా ఉంటుంది. కొండపల్లి ప్రాంత అడవిలో ఈ చెట్లు సమృద్ధిగా పెరుగుతాయి. నేడు కొండపల్లిలో కొన్ని కుటుంబాలవారు మాత్రమే బొమ్మల తయారీ వృత్తిలో జీవనం సాగిస్తున్నారు. ఏళ్ల తరబడి నుండి బొమ్మల తయారీ ద్వారా తమ చేతికి పని చెబుతూ జీవనాన్ని సాగిస్తున్నారు. కొండపల్లి బొమ్మల తయారు చేసే వారి జీవన విధానాన్ని ఆ ప్రాంతానికే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగానే కాక పలు దేశాలలోనూ ప్రాబల్యాన్ని చాటుతోంది. తెల్ల పొనికి చెక్క కొండపల్లి బొమ్మలు తయారు చేయడానికే మాత్రమే పనికి వస్తుంది. పురుషులు బొమ్మలు తయారు చేస్తే, స్త్రీలు వాటికి రంగులు అద్దుతారు. కొండపల్లి బొమ్మలు కొండపల్లిలో మాత్రమే తయారవుతాయి.

## తయారీ విధానం

ముందుగా స్థానిక అడవిలో లభించే పొనికి పేరుగల మృదువైన సహజమైన కలపను సేకరిస్తారు. ఉల్లి సాయంతో కలపను చెక్కుతారు. స్థానికంగా లభించే రంపం పొట్టు, చింత గింజల పొడి మిశ్రమానిక ఉపయోగించి ఆక్రా పేస్టును తయారు చేస్తారు. ఈ మిశ్రమం జిగురుగా ఉండి అతుక్కునే స్వభావం కలిగివుంటుంది. చెక్కడం పూర్తయిన తర్వాత ముందుగా తయారు చేసిన ఆక్రా పేస్టును బొమ్మకు పూస్తారు. ఇది పగుళ్ల కనిపించకుండా చేసి బొమ్మకు సరైన అకృతిని ఇస్తుంది. బొమ్మను ఎండబెట్టి, ఇసుక కాగితంతో రుద్దడం ద్వారా నునుపుగా చేస్తారు.బొమ్మ బాహ్యారూపం తయారైన పిదప కూరగాయలతో తయారు చేసిన రంగులను, ఎనామిల్ పెయింట్లను బొమ్మలుకు వేస్తారు. ముందుగా బొమ్మల విడిభాగాలు తయారు చేస్తారు. కాళ్ళు, చేతులు, తల ఇత్యాది భాగాలను విడి విడిగా తయారుచేసిన అనంతరం వీటన్నింటినీ చింతగింజల పొడితో తయారు చేసిన బంకతో ఒకటిగా అతికిస్తారు. అష్ట వంకరలు వున్న తెల్ల పొనికికి బొమ్మ రూపంలో సజీవ కళ ఉట్టి పడిందంటే అది కచ్చితంగా కొండపల్లి బొమ్మే,

## పలు రకాల బొమ్మలు

కొండపల్లి బొమ్మల్లో బాగా గుర్తింపు పొందినవి ఏనుగు అంబారీలు, గీతోపదేశం, కృష్ణుడు గోపికలు, దశావతారాల సెట్, కొబ్బరి చెట్టు, దాన్సింగ్ బాల్, పెళ్లిపల్లకి, గ్రామీణ నేపథ్యం ఉట్టిపడే ఎడ్లబండి, సంక్రాంతి పండుగ, వివిధ రకాల పక్షులు, పాలు, పెరుగు చిలకరించడం, హిందూ దేవతామూర్తుల బొమ్మలు చెప్పుకోదగినవి. సంప్రదాయ కొండపల్లి బొమ్మలను స్థానికంగా కొండపల్లి  బొమ్మలు అని పిలుస్తారు. నేటికీ సంప్రదాయ ఇతివృత్తాలను అనుసరించే కొన్ని ప్రసిద్ధ ఉత్పత్తులు ఉన్నాయి. ఇవి కొండపల్లి బొమ్మల కళాకారుల నైపుణ్యం, సృజనాత్మకతకు అద్దం పడతాయి. సంప్రదాయ ఉత్పత్తులు ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొండపల్లి ఆట బొమ్మ, గ్రామ జీవితంలోని అనేక వృత్తాలు, పులి, ఏనుగు, అవుదూడ, గంగిరెద్దు, అర్జునుడి రథం, తాటిచెట్టు, హంసలు, పెళ్ళికుమార్తె పల్లకీ మోసేవారు, నెమళ్ళు, చిలుకలు, బావి నుండి నీరు తోడే స్త్రీలు, పాములను ఆడించేవారు, కుమ్మరివారు, వివాహ వేడుక, శ్రీకృష్ణుడు వేణువు వాయిస్తూ సుందరంగా కనిపించే బొమ్మ ఇత్యాది అనేక ఆకర్షణలు కొండపల్లి బొమ్మల్లో కనిపిస్తాయి.





దాన్సింగ్ డాల్ బొమ్మను కదిలిస్తే నృత్యం చేసినట్లు తలతో పాటు బొమ్మ మొత్తం ఊగిపోతూ బుట్టబొమ్మలా చాలా సుందరంగా కనిపిస్తుంది. దశావతారాల బొమ్మలు మూడు అంగుళాల నుండి తొమ్మిది అంగుళాల వరకు తయారు చేస్తున్నారు. ఆర్డర్లపై అయిదు అడుగుల బొమ్మలను కూడా తయారు చేస్తున్నారు. ఎన్ని రకాల కొండపల్లి బొమ్మలు తయారు చేసినప్పటికీ వాటిని కొనుగోలు చేసి ఆదరించే వారు తగ్గిపోవడంతో కళాకారుల జీవితాలు ఆర్థిక ఇబ్బందులతో అతలాకుతలం అవుతున్నాయి. ఒకప్పుడు బొమ్మల కొలువులో కొండపల్లి బొమ్మలను పెట్టేవారు. నేడు అనేక రకాల బొమ్మలను బొమ్మల కొలువులో పెడుతున్నారు. నేటి తరం పిల్లలకు బొమ్మల గురించి చెప్పమంటే విదేశాలకు చెందిన బార్బిడాల్, టెడ్డీబేర్, ఇతర చైనా బొమ్మల పేర్లు చెబుతారు. కొండపల్లి బొమ్మల వైభవం వీరికి తెలియదు. అందువల్ల ఈ తరం వారికి తెలియజేయవలసిన అవసరం ఉంది.



## చేయూతనిస్తున్న ప్రభుత్వం

కొండపల్లి బొమ్మల తయారీకి అవసరమైన పోనికి చెట్లు తగ్గిపోతున్నాయి. దాంతో కలప ఉత్పత్తి తగ్గి కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల బొమ్మల తయారీకి కావలసిన కలపనిచ్చే పోనికి చెట్ల పెంపకానికి ప్రణాళికలు రూపొందించి కృషి చేస్తూ అంతరించిపోతున్న పోనికి చెట్లకు జీవం పోస్తున్నారు. అటవీ శాఖ వారు ఉడ్ బ్యాంకును ఏర్పాటు చేసి కళాకారులకు అవసరమైన కలపను అందిస్తూ చేయూతనిస్తున్నారు. ఇతర మొక్కల మాదిరిగా తెల్ల పోనికిని పెంచడం అంత సులభం కాదు. దీనికి అపారమైన పోషణ అవసరం. దాని కలప తియ్యగా, మృదువుగా ఉంటుంది. ఆ కారణంగా ఇది అనేక తెగుళ్ళకు గుళ్ళకు బలైపోతుంది. పైగా తెల్ల పోనికి పెరగడానికి చాలా సమయం పడుతుంది. సొసైటీలు ఏర్పడినప్పటికీ కళాకారులకు ఒరిగింది తక్కువే అంటున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేసి, యువతరానికి శిక్షణ ఇస్తే, ప్రోత్సాహకంతో పాటు, చేతిపనులు కోల్పోయిన వైభవాన్ని తిరిగి పొందేలా కృషి చేయవచ్చు. అందువల్ల ప్రభుత్వమే పూనుకుని పోనికి చెక్కను కళాకారులకు అందుబాటులో తెచ్చి ఆన్లైన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే బాగుంటుందని కొందరి అభిప్రాయం. ఆ దిశగానే అడుగులు వేస్తూ కొండపల్లి బొమ్మల విక్రయాలను మరింత పెంచే కృషి చేస్తున్నారు. కొందరు యువ కళాకారులు పానికి చెక్కకు బదులు టేకు కర్రతో కూడా కొండపల్లి బొమ్మలను తయారు చేస్తూ ఆన్‌లైన్ అమ్మకాల ద్వారా అందర్జాతీయ మార్కెట్‌ను సాధిస్తున్నారు. పోటీ ప్రపంచంలో నిలబడటానికి కొత్త రకమైన ఆలోచనలతో, సృజనతో కూడిన టేకుతో చేసిన నవీన బొమ్మలను కూడా కొందరు యువకులు తయారు చేస్తూ ప్రశంసలందుకుంటున్నారు.

కొండపల్లి బొమ్మలు బహుమతులుగా ఇవ్వటానికి చాలా బాగుంటాయి. ఎక్కువగా చెట్ల ఆకులు, బెరడుల నుండి తయారు చేసిన సహజ రంగులనే వాడతారు. ఈ బొమ్మలు ఇళ్లల్లోని షోకేసుల్లో పెట్టుకోవడానికి అనువుగా చిన్న పరిమాణంలో ఉంటాయి. నేడు కొండపల్లి కళాకారులు జీవన భృతికోసం వారు తయారు చేసిన బొమ్మలను సుదూర ప్రాంతాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో అమ్ముకుంటున్నారు. పూర్వ కాలంలో సొసైటీల సహకారంతో అమ్మకాలు జరిగేవి. కొండపల్లి కొయ్య బొమ్మల పనివారల పరస్పర సహాయక క్రయ, విక్రయ సహకార సంఘం లిమిటెడ్ 1936లో ఏర్పడింది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కళాకారుల జీవితాలు మారలేదు. ఉంటానికి సొంత ఇళ్లు కూడా ఉండేవి కావు. అద్దె ఇళ్ళల్లో ఉన్నవారు అద్దెలు కూడా కట్టుకోలేని దీన పరిస్థితుల్లో ఉండేవారు. అటువంటి స్థితిలో నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న డాక్టర్ నందమూరి తారకరామారావు 1986లో కొండపల్లి గ్రామానికి వచ్చి కళాకారుల దీన గాథలను విని చలించిపోయి ఆంధ్రప్రదేశ్ హస్త కళాకారుల కర్మాగార గృహ సముదాయాన్ని బొమ్మల కాలనీ పేరుతో ప్రారంభించి ఇళ్ళు నిర్మించి ఇక్కడి కళాకారులకు ఇచ్చారు. ఈ ప్రోత్సాహంతో కొండపల్లి బొమ్మలు తయారు చేసే కళాకారులు కొంతమేరకు పెరిగారు. తరువాత చంద్రబాబునాయుడు హయాంలో డి.ఆర్.డి.ఏ, వారు, ద్వాక్రా పథకాల ద్వారా కళాకారులకు అప్పుల రూపంలో పెట్టుబడులు పెట్టి ప్రోత్సహించారు. లేపాక్షి ఎంపోరియమ్, అమెజాన్, మైస్టేట్ బజార్ ఇత్యాది వేదికలు చేతిపనులను ప్రోత్సహించే ఇటువంటి ఉత్పత్తులను ఆమోదించి మార్కెటింగ్ చేస్తున్నప్పటికీ, కొండపల్లిలోని బొమ్మలను తయారు చేస్తున్న కళాకారుల జీవితాలను ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కించలేక పోతున్నాయని కొందరి వాదన. ఏది ఏమైనా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక చిహ్నాలుగా విరాజిల్లుతున్న కొండపల్లి కొయ్యబొమ్మలను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ■



# ఏప్రియల్ 6, 2025 నుండి ఏప్రియల్ 12, 2025 వరకు



## వారఫలం

**శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు**

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం



ఈ వారం ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. రుణబాధలు ఎక్కువై చికాకులు పెడతాయి. నూతన పెట్టుబడులు విషయంలో తొందరపాటు వద్దు. ప్రత్యర్థులు స్నేహహస్తం అందిస్తారు. నిత్యం సర్పదోష నివారణ చూర్ణమును సర్పదోష నివారణ చూర్ణముతో కలిపి బొక్కెన నీటిలో రెండు చెంచాలు చూర్ణమును కలిపి ప్రతిరోజు స్నానం చేయడం వల్ల అన్ని దోషాలు పోతాయి.

### వృషభం



ఈ వారం వాహనాలు, ఆభరణాలు కొంటారు. వృత్తి, వ్యాపారాలలో ముందుడగు. రాజకీయ, కళారంగాల వారికి విశేషంగా రాణిస్తుంది. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. నిత్యం కౌముది ధరించటం వలన ఆరోగ్య, ఆర్థిక స్థితిగతులు మొదలైనవి లాభిస్తాయి. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. నిత్యం శ్రీ వినాయక అష్టోత్తర శతనామావళి పఠించండి.

### మిథునం



ఈ వారం ఆర్థిక వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. కొత్త వసువులు కొంటారు. కాంట్రాక్టులు రాగలవు. అవార్డులు, రివార్డులు పొందుతారు. నిత్యం శ్రీ లక్ష్మీచందనం ధరించటం వలన మేలు జరుగుతుంది. పరీక్షలుల, ఇంటర్వ్యూల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకం. వివాదాలకు దూరంగా వుండండి.

### కర్కాటకం



ఈ వారం కొత్త పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికాభివృద్ధి సాధిస్తారు. రుణాలు తీరి ఊరట చెందుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. స్థిరమైన ఉద్యోగాలలో ప్రవేశిస్తారు. కొన్ని సమస్యలు తీరి ఊరట చెందుతారు. ఎరుపు వత్తులు అష్టమూలికా తైలంతో కలిపి దీపారాధన చేయండి.

### సింహం



ఈ వారం అందరిలోనూ గుర్తింపు పొందుతారు వివాదాలకు నుండి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో చికాకులు తొలగుతాయి. రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాల వారికి విదేశీ పర్యటనలు వుంటాయి. ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా వుంటాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. రుణాల తీరుతాయి.

### కన్య



ఈ వారం విమర్శించిన వారే ప్రశంసిస్తారు. శ్రమకు తగ్గిన ఫలితం అందుకుంటారు. హెూదాలో ఉన్నవారితో పరిచయాలు పెరుగుతాయి. పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి యోగదాయకం. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ముఖ్యమైన పనులు శ్రమానంతరం పూర్తి చేస్తారు. అమ్మవారిని ఈ జువ్వాదితో పూజిస్తే మంచి ఫలితాలు వుంటాయి. రుణబాధలు తొలగుతాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

### తుల



ఈ వారం పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు పొందుతారు. పలుకుబడి కలిగిన వారి సహాయం పొందుతారు. చిరకాల ప్రత్యర్థులు మిత్రులుగా మారి సాయం అందిస్తారు. వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరం. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి సన్మాన, సత్కారాలు పొందుతారు. నిత్యం లక్ష్మీతామర వత్తులు, అష్టమూలికాతైలంతో కలిపి దీపారాధన చేయటం లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుంది. ఆరోగ్యభంగం, చికాకులు.

### వృశ్చికం



ఈ వారంఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. నిత్యం శ్వేతార్క గణపతిని పూజించుట వలన పిల్లల చదువులు అన్ని పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగుతాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు.

### ధనస్సు



ఈ వారం రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కలిసి వచ్చే కాలం అప్రయత్న కార్యసిద్ధ పొందుతారు. వివాదాలకు దూరంగా వుండండి. ఆర్థిక విషయాలలో పురోగతి సాధిస్తారు. నిత్యం కౌముది ధరించండి. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా వుంటుంది.

### మకరం



ఈ వారం మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు. ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. పారిశ్రామిక, రాజకీయ రంగాల వారికి అనూహ్యమైన అవకాశాలు పొందుతారు. నిత్యం యజ్ఞ భస్మం ధరించటం వల్ల యజ్ఞం చేసిన ఫలితం లభిస్తుంది. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగు పడుతుంది. బాకీల వసూలవుతాయి.

### కుంభం



ఈ వారం నూతన పెట్టుబడులకు తగిన సమయం. ప్రముఖులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాల అనుకూలంగా ఉంటుంది. వివాదాలకు దూరంగా వుండండి. నిత్యం త్రిశూల్ చేత పొగవేయటం వలన మీ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. కొత్త అంచనాలు, వ్యూహాలతో ముందడుగు వేసి క్లిష్టమైన పనులు కూడా పూర్తి చేస్తారు.


### మీనం




ఈ వారం ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. బంధువుల తోడ్పాటు లభిస్తుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. నిత్యం దైవికమ్ ధూపం వల్ల మీ పిల్లలకు అన్నిరకాల దుష్టశక్తుల నుండి రక్షణ కలుగుతుంది. విలువైన వస్తువులు కొంటారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. దీర్ఘకాలిక రుణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. వివాదాల నుండి బయటపడతారు.

ఈ వారం కా'ర్టూన్స్'


రోజూ ఇంట్లో రెండు పూటలా 'హాజరు వేయించుకోవాలి
అంటున్నాడట.. పోలీస్ స్టేషన్లోనే ఒకపూట కదమ్మా..!!


'హాయ్ ఫ్రెండ్స్'.. భటుల గారు 'పాశం'తో రెడీగా ఉన్నారు..
వారికి మొదటిది, నాకు ఆఖరి రీల్.. ప్లీజ్ లైక్, షేర్, కామెంట్..!!


నేనెప్పుడూ ఎవరి దగ్గరా
'మోకరిల్ల' లేదు!!
Zakir...





చైనాలోని
ఈ వ్యాలీని వేవ్ వ్యాలీ అని
అంటారు. ఒక్కో కాలంలో
ఒక్కో రంగుతో మార్పు
చెందడం దీని
ప్రత్యేకత.



